## ప్రిజన్ డ్యూటీమీట్ విజేతలకు సిఎం అభినందనలు





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## యాత్రాదానం బస్సు సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోండి





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 261 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 09 రూ - 03/- బుధవారం 17 సెప్టెంబర్ 2025


## మెట్రో సెక్యూరిటీ గార్డులుగా ట్రాన్స్‌జెండర్లు 20మందికి నియామక పత్రాలు అందచేత






## డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్న 16,000 మంది

# విదేశీయుల బహిష్కరణ

- మాదకద్రవ్యాల ముఠాలపై కేంద్ర ప్రభుత్వం భారీ చర్యలు
- ఎన్‌సీబీ నివేదిక ఆధారంగా కేంద్ర హెూం శాఖ నిర్ణయం
- జాబితాలో బంగ్లాదేశ్, నైజీరియా, మయన్మార్ దేశీయులు
- కొత్త వలస చట్టం నిబంధనల ప్రకారం బహిష్కరణ ప్రక్రియ
- ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్న విదేశీయులు

**న్యూఢిల్లీసెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. దేశవ్యాప్తంగా డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 16,000 మంది విదేశీ పౌరులను దేశం నుంచి బహిష్కరించేందుకు రంగం సిద్ధం చేసింది. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. **మిగతాది 2లో...**



## నేడు ప్రజాపాలన

# దినోత్సవం



### - పబ్లిక్ గార్డెన్‌లో జెండా ఎగురేయనున్న సిఎం

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ విమోజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17వ తేదీ బుధవారం నాడు ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లా ఇంచార్జీ మంత్రి జాతీయ జెండా ఎగురవేయాలని ప్రభుత్వం సర్క్యులర్ మిగతా2లో...

## మందుల రీ-లేబులింగ్

# తప్పనిసరి కాదు

- మందుల రీ-లేబులింగ్‌పై ఫార్మా కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఊరట
- మార్కెట్లో ఉన్న పాత స్టాక్‌ను వెనక్కి పిలవాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్మాస్యూటికల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. కొన్ని వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లను ఇటీవల తగ్గించిన నేపథ్యంలో, మార్కెట్లో ఇప్పటికే ఉన్న మిగతా2లో...





## ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వండి

### కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు తుమ్మల వినతి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్‌ను కోరామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రులతో సమావేశం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎరువుల విషయంలో రైతులకు వచ్చిన ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. అధికంగా మిగతా2లో...

## బెట్టింగ్ యాప్ కేసులో యువరాజ్, సోనూ సూద్‌లకు ఈడీ సమన్లు

### 1xBet బెట్టింగ్ యాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ

- మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్పలకు సమన్లు
- నటుడు సోనూ సూద్‌ను కూడా విచారణకు పిలిచిన అధికారులు
- గతంలో శిఖర్ ధావన్, సురేశ్ రైనాలను ప్రశ్నించిన ఈడీ





## కేంద్రం జీఎస్టీ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

- తెలంగాణలో జీఎస్టీ కమిటీని నియమించిన బీజేపీ..
- జీఎస్టీపై దృష్టి సారించిన తెలంగాణ బీజేపీ
- ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ నియామకం
- కమిటీలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,
- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుకు చోటు





## రాజ్యాంగంపై బిజెపికి

# గౌరవం లేదు

### పాక్‌తో క్రికెట్ ఆడడంపై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్, 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజ్యాంగంపైన, సుప్రీంకోర్టుపైన బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పహల్గాం మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటం బీజేపీ కపట దేశభక్తికి నిదర్శనమని మంగళవారం ఉదయం కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను బీఆర్ఎస్ స్వాగతించడాన్ని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీది నకిలీ జాతీయవాదమని, తమది ఆచరణలో, ఆత్మలో నిజమైన జాతీయ వాదమని స్పష్టంచేశారు. మిగతా2లో...

## జిఎస్టీ రేట్ల తగ్గింపు

# ప్రజలకు చేరాలి

- ధరల వివరాలను వ్యాపారులు డిస్‌ప్లే చేయాలి
- ట్రేడర్స్ అసోసియేషన్లకు భట్టి సూచన



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వస్తువులు, సేవల పన్ను రేట్ల సవరణ తర్వాత డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క ఎంసీఆర్ హెచ్ఆర్డీలో **మిగతాది 2లో...**

## సాంప్రదాయ యుద్ధాలకు

# కాలం చెల్లింది

### కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి

: సైన్యానికి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సాంప్రదాయ యుద్ధ పద్ధతులకు కాలం చెల్లాయని, ఇకపై దేశం ఎదుర్కోబోయేది సమాచార, సైద్ధాంతిక, పర్యావరణ, జీవ సంబంధిత యుద్ధాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. **మిగతాది 2లో...**

## సాగుచేసుకుంటున్న

# రైతులకే పట్టాలు

- మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలి
- సాగర్ నియోజకవర్గ భూ సమస్యలపై సమీక్ష
- రెవెన్యూ, అటవీ అధికారులకు మంత్రి పొంగులేటి సూచన



# కేంద్రం జీఎస్టీ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

## తెలంగాణలో జీఎస్టీ కమిటీని నియమించిన బీజేపీ..

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**

తెలంగాణలో జీఎస్టీపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించేందుకు బీజేపీ నడుం బిగించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న జీఎస్టీ సంబంధిత నిర్ణయాలను క్షేత్రస్థాయికి బలంగా చేరవేసే లక్ష్యంతో ఆరుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందరరావు మంగళవారం ఈ కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు బొమ్మ జయశ్రీ, క్రాంతి కిరణ్, పోరెడ్డి కిశోర్ రెడ్డి, హనుమాండ్లు కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానంలో ఎప్పటికప్పుడు చేస్తున్న మార్పులు, వాటి ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడమే ఈ కమిటీ యొక్క ప్రధాన విధి అని తెలుస్తోంది. జీఎస్టీపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు ఈ కమిటీ వ్యూహాత్మకంగా పనిచేయనుంది.

# డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్న 16,000 మంది విదేశీయుల బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ బహిష్కరణ ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇటీవలి కాలంలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చేపట్టిన అతిపెద్ద చర్యల్లో ఇది ఒకటిగా నిలవనుంది. డ్రగ్స్ స్మగ్లింగ్ నుంచి రవాణా వరకు వివిధ రకాల నేరారోపణలు ఎదుర్కొంటున్న విదేశీయులను గుర్తించి, వారి జాబితాను ఎన్‌సీబీ సిద్ధం చేసింది.ఈ జాబితాను ఇప్పటికే హోం మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత ఏజెన్సీలకు అందజేసినట్లు సమాచారం. బహిష్కరణకు గురికానున్న వారిలో బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, మయన్మార్, మలేషియా, ఘనా, నైజీరియా వంటి దేశాలకు చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న డిటెన్షన్ కేంద్రాల్లో అదుపులో ఉన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన వలస చట్టంలోని నిబంధనల ప్రకారం వీరిని వారి సొంత దేశాలకు పంపించే ప్రక్రియను చేపట్టనున్నారు.

# బెట్టింగ్ యాప్ కేసులో యువరాజ్, సోనూ సూద్‌లకు ఈడీ సమన్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**అక్రమ బెట్టింగ్ యాప్ 1xBetకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ప్రశ్నించిన అధికారులు.. తాజాగా మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, ప్రముఖ నటుడు సోనూ సూద్‌లకు సమన్లు జారీ చేశారు. ఈ నెలలోనే వారిని విచారించేందుకు ఈడీ సిద్ధమైంది.ఈడీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెల 22న రాబిన్ ఉతప్ప, 23న యువరాజ్ సింగ్, 24న సోనూ సూద్ విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ బెట్టింగ్ యాప్‌ను ప్రచారం చేసినందుకు గాను వారి ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాలపై అధికారులు ఆరా తీయనున్నారు. కాగా, ఈ కేసులో భాగంగా బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా, మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి మంగళవారం తమ పత్రాలను ఈడీ అధికారులకు సమర్పించారు.ఈ విషయంపై వారి తరఫు న్యాయవాది శశి కౌశిక్ మాట్లాడుతూ, "వారు సమర్పించినవి సాధారణ పత్రాలు మాత్రమే. అందులో ముఖ్యమైనవి ఏమీ లేవు. విచారణలో భాగంగా అధికారులు వారి కాంటాక్టులను ధృవీకరించుకుంటున్నారు. ఇది కేవలం దర్యాప్తులో ఒక సాధారణ ప్రక్రియ మాత్రమే" అని వివరించారు.1xBet బెట్టింగ్ యాప్ కార్యకలాపాల్లో భారీగా మనీ లాండరింగ్ జరిగినట్లు ఈడీ ఆరోపణలు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ యాప్‌కు ప్రచారకర్తలుగా వ్యవహరించిన ప్రముఖులపై దృష్టి సారించింది. గతంలో భారత మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాలను కూడా ఈడీ అధికారులు గంటల తరబడి ప్రశ్నించారు. సైప్రస్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థపై ఇప్పటికే యూకే, అమెరికా, రష్యా, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ఆర్థిక అవకతవకల ఆరోపణలతో నిషేధం అమల్లో ఉంది. గతేడాది సంచలనం సృష్టించిన 'మహాదేవ్ సట్టా యాప్' కుంభకోణం తరహాలోనే ఈ కేసులో కూడా పలువురు సెలబ్రిటీల ప్రమేయం బయటపడటం గమనార్హం.

# మెట్రో సెక్యూరిటి గార్డులుగా ట్రాన్స్‌జెండర్లు 20మందికి నియామక పత్రాలు అందచేత



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ మెట్రో లో 20 మంది ట్రాన్స్‌జెండర్లను తెలంగాణ ప్రభుత్వం సెక్యూరిటీ గార్డులుగా నియమించింది..మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ- గార్డులుగా నియమిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు. సెక్యూరిటీ- గార్డు నియామకాల కోసం దాదాపు 300 నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి, వారు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని.. ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. వారు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇతర ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పుకొచ్చారు. వీరు ఈ సమాజానికి ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

# సాంప్రదాయ యుద్ధాలకు కాలం చెల్లింది

(మొదటి పేజీ తరువాయి)

ఈ సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఆయన ప్రసంగించారు.ప్రస్తుత కాలంలో యుద్ధాలు ఎప్పుడు, ఎలా మొదలవుతాయో ఊహించడం చాలా కష్టమని రాజ్‌నాథ్ అన్నారు. "యుద్ధం రెండు నెలలు జరగొచ్చు, ఏడాది లేదా ఐదేళ్లయినా కొనసాగవచ్చు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మన సైనిక సామర్థ్యం సరిపడా ఉండేలా చూసుకోవాలి" అని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సంఘర్షణల నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న సైన్యం యొక్క ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత అయిన 'సుదర్శన చక్ర' వ్యూహాన్ని నిర్మించేందుకు కమాండర్లు చొరవ తీసుకోవాలని రాజ్‌నాథ్ కోరారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వాస్తవిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకు మధ్యకాలిక, పదేళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన 'జై' (జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్) మంత్రం ప్రాముఖ్యతను ఆయన పునరుద్ఘాటించారు.ఆత్మనిర్భరత అనేది కేవలం నినాదం కాదని, అది మన దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అత్యంత కీలకమైన అవసరమని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం మన బలం, వ్యూహం, స్వావలంబనకు నిదర్శనమని కొనియాడారు.

# మందుల రీ-లేబులింగ్ తప్పనిసరి కాదు

(మొదటి పేజీ తరువాయి)

మందుల ప్యాకెట్లపై కొత్త ధరల స్టిక్కర్లను తప్పనిసరిగా అంటించాలన్న నిబంధనను రద్దు చేసింది. సెప్టెంబర్ 22లోపు మార్కెట్లోకి విడుదలైన స్టాక్‌ను వెనక్కి పిలవడం లేదా రీ-లేబులింగ్ చేయడం తప్పనిసరి కాదని ఫార్మాస్యూటికల్స్ విభాగం స్పష్టం చేసింది.

ఈ నెల ప్రారంభంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వైద్య పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ఈ మార్పు నేపథ్యంలో, మార్కెట్లో ఉన్న పాత స్టాక్‌ను రీ-లేబుల్ చేయడం ఆచరణ సాధ్యం కాదని, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని ఫార్మా పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఒక కీలక ప్రకటన జారీ చేసింది.పాత స్టాక్‌ను వెనక్కి పిలవాల్సిన అవసరం లేకుండా, సవరించిన ధరలతో కూడిన జాబితాను కంపెనీలు జారీ చేస్తే సరిపోతుందని తెలిపింది. ఈ కొత్త ధరల జాబితాను డీలర్లు, రిటైలర్లతో పాటు రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లకు, ప్రభుత్వానికి అందించాలని సూచించింది. రిటైలర్లు తమ వద్ద ఆ జాబితాను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. దీనివల్ల మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండవని, రోగులకు మందుల కొరత ఏర్పడదని ప్రభుత్వం భావిస్తోంది.

మరిన్ని సంస్కరణలు అవసరం: ఏఐఎంఈడీ

జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు చేపట్టాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైస్ ఇండస్ట్రీ (ఏఐఎంఈడీ) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రిఫండ్లలో ఉన్న పరిమితులు, ఇన్వర్టెడ్ డ్యూటీ సమస్యలను పరిష్కరించాలని కోరింది. సర్వీసులు, క్యాపిటల్ గూడ్స్‌పై చెల్లించిన ఐటీసీకి కూడా రిఫండ్ అనుమతించాలని, ఇన్‌పుట్స్‌పై ఒకే విధంగా 5 శాతం జీఎస్టీ విధించాలని సూచించింది.

ఏఐఎంఈడీ ఫోరమ్ కోఆర్డినేటర్ రాజీవ్ నాథ్ మాట్లాడుతూ, "ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఇన్‌పుట్స్‌పై చెల్లించిన జీఎస్టీకి పూర్తి రిఫండ్ ఇస్తున్నారు. దీనివల్ల వ్యాపారాలకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి. మన దేశంలోనూ ఇలాంటి సంస్కరణలు తీసుకువస్తేనే ఆరోగ్య సంరక్షణ ఖర్చులు తగ్గుతాయి... 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవుతుంది" అని అభిప్రాయపడ్డారు.

# సాగుచేసుకుంటున్న రైతులకే పట్టాలు

## మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలి - సాగర్ నియోజకవర్గ భూ సమస్యలపై సమీక్ష

### రెవెన్యూ, అటవీ అధికారులకు మంత్రి పొంగులేటి సూచన



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. డాక్టర్ బి. ఆర్, అంబేద్కర్ సచివాలయంలో మంగళవారంనాడు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై అటవీ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖతో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె. జానా రెడ్డి, నాగార్జున సాగర్ శాసన సభ్యులు కె. జయవీర్ రెడ్డి, దేవరకొండ శాసనసభ్యులు బాలూ నాయిక్, రెవెన్యూ శాఖ సెక్రటరీ డి ఎస్.లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 40-50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీ వేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ , ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించడం జరిగిందని ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం 23వేల ఎకరాలో సర్వే నిర్వహించగా అందులో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. వీటిలో 4 వేల ఎకరాలు పాసుపుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎకరాలకు సంబంధించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. అంతేగాక ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్లు-గుర్తించి వారి పాసు పుస్తకాలను రద్దుచేశామని తెలిపారు. వీరికి రైతు భరోసా, రైతు భీమా తదితరాలను రద్దు చేశామన్నారు. సర్వేలో భాగంగా 7వేల ఎకరాలు అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# ప్రిజన్ డ్యూటీమీట్ విజేతలకు సిఎం అభినందనలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**7వ ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో వివిధ పోటీలలో పతకాలు సాధించిన వారిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో జరిగిన పోటీలలో 133 పతకాల్లో 28 సాధించారు. ఇందులో 21 బంగారు, 4 రజతం, 3 కాంస్యంపతకాలను తెలంగాణ కైవసం చేసుకున్నది. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, జైళ్ల విభాగం డీజీ సౌమ్య మిశ్రా, ఐజీ మురళి బాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, ఎస్పీలు శివ కుమార్ గౌడ్, కళాసాగర్, డ్యూటీ- మీట్ పోటీ విజేతలు పాల్గొన్నారు.

# నేడు ప్రజాపాలన దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సిఎం రేవంత్ రెడ్డి సైతం 17వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జాతీయ జెండా ఎగురవేయనున్నారు. పబ్లిక్ గార్డెన్ జరిగే కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి సందేశం ఇస్తారు. డిప్యూటీ- సిఎం భట్టి విక్రమార్క ఆయన సొంత జిల్లా ఖమ్మంలో జెండా ఆవిష్కరించనుండగా మంత్రులు వివేక్ మెదక్ జిల్లాలో, కొండా సురేఖ, వరంగల్‌లో, అడ్లూరి లక్ష్మణ్, కరీంనగర్‌లో, భద్రాద్రి కొత్తగూడెం తుమ్మల నాగేశ్వరరావు, మహబూబ్‌నగర్ జూపల్లి కృష్ణారావు, ములుగు సీతక్క, రంగారెడ్డిలో శ్రీధర్‌బాబు, సంగారెడ్డిలో దామోదర రాజనర్సింహా తదితరులు జెండా ఎగురేయనున్నారు. సెప్టెంబర్ 17వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తుండగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తోంది.

## ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతులపై ఆధారపడినందున ఇబ్బందులు వస్తున్నాయి. రైతులను కాపాడే విషయంలో కొన్ని చర్చలు జరిగాయి. 1968లో చేసిన విత్తన చట్టానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన చట్టాన్ని ఆమోదించాలని కోరాం. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. దేశంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు దిగుమతి సుంకాలు పెంచాలని కోరాం.కొత్తగూడెం విమానాశ్రయం గురించి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చించాం. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధంచి భూ సేకరణ పూర్తయిందని తెలిపాం. కేంద్ర ఉక్కుశాఖమంత్రి కుమారస్వామిని కలిసి బయ్యారం స్టీల్ విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# జిఎస్టీ రేట్ల తగ్గింపు ప్రజలకు చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

ట్రేడర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జీఎస్టీ పన్నుల తగ్గింపు, దాని ప్రయోజనాలు ప్రజలకు ఎలా చేరాలనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విధానపరమైన నిర్ణయాలు ఎన్ని తీసుకున్నా.. వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందాలని ఆయన అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తీసుకున్నామని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు, రైతులకు ఉపయోగపడే వస్తువులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించిన వస్తువుల ధరల వివరాలను వ్యాపారులు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. షోరూమ్‌ల ముందు కచ్చితంగా రేట్ల ధర పట్టికలు పెట్టాలని.. అప్పుడే, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయంపై అవగాహన వస్తుందని ఆయన కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశంపైన అయినా చర్చించడానికి సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. వ్యాపారస్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, తక్షణమే స్పందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో వ్యాపారులు కలిసి పనిచేసి జీఎస్టీ సవరణ ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని ఆయన కోరారు.

# రాజ్యాంగంపై బిజెపికి గౌరవం లేదు

(మొదటి పేజీ తరువాయి)

కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి భారతీయుడిని సమానంగా ఆదరించడమే తమ దృష్టిలో నిజమైన జాతీయవాదం అన్నారు. జాతీయవాదానికి, దురహంకార దేశభక్తికి మధ్య ఉన్న తేడాను తెలుసుకోవడమే అసలైన దేశభక్తి అని చెప్పారు. పహల్గాం దారుణ మారణకాండకు కారణమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడించిన బీజేపీకి బీఆర్ఎస్ దేశభక్తి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని విమర్శించారు.పాక్ ప్రేరేపిత ఉగ్రదాడిలో మరణించిన 26 మంది అమాయకుల నెత్తురు తడి ఇంకా ఆరకముందే ఆ దేశంతో క్రికెట్ ఆడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒప్పుకోవడం ఆ పార్టీ నకిలీ జాతీయవాదం, కపట దేశభక్తికి తిరుగులేని సాక్ష్యం అన్నారు. పహల్గాం బాధిత కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఏ మాత్రం పట్టించుకోకుండా కోట్లాది భారతీయులను మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

# మైదం మహేష్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆర్థిక సహాయం





**ములుగు,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా, ములుగు:ములుగు మండలంలోని మాధవ రావుపల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మైదం మహేష్ ఆత్మహత్యపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మైదం మహేష్ కుటుంబానికి రూ.5,50,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ములుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు మహేష్ నివాసానికి వెళ్లి బాధిత కుటుంబానికి పోస్టల్ బాండ్ అందజేశారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ, మైదం మహేష్ ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. ఐదు నెలలుగా వేతనం అందకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మహేష్ ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.సాక్ష్యాత్తు మున్సిపల్ శాఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా కార్మికులకు జీతాలు అందకపోవడం రాష్ట్ర ప్రభుత్వ ఘోర వైఫల్యమని మండిపడ్డారు. స్థానిక మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. మహేష్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు పిల్లల విద్యను ప్రభు త్వం భరించాలని, అలాగే రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. మహేష్ ఆత్మహత్యపై నిష్పక్షపాత ఎంక్వయిరీ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇకపై రాష్ట్రవ్యాప్తంగా సపాయి కార్మికుల పరిస్థితి విషమంగా మారిందని, జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మహేష్ కుటుంబానికి అండగా ఉండేందుకు భిక్షాటన కార్యక్రమం నిర్వహించి వచ్చిన రూ.1,01,116/- విరాళాన్ని కూడా అందజేశామని తెలిపారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి, కుడుముల లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పిటిసి సకినాల భవాని, ములుగు టౌన్ ప్రెసిడెంట్ చెన్న విజయ్, పోరిక విజయ్ రామ్ నాయక్, భూక్య మురళి, ఆకుతోట చంద్రమౌళి, కవ్వంపల్లి బాబు, బైకాని సాగర్, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చే విధంగా ఆదేశించిన సీఎం

**దామెర, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** రెండు కాళ్లు కోల్పోయి ఇక జీవితం అయిపోయిందని తీవ్ర ఆందోళనకు గురైన ఆ విద్యార్థికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించిన ప్రోత్సాహంతో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యమంత్రి చూపించిన దాతృత్వానికి ఆ విద్యార్థి, అతనితో పాటు కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో రేవంత్ రెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ జీవితంలో ఐఐటీ సాధించాలన్న పట్టుదలతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2024 నవంబర్ 2 న రాజస్థాన్ కోటాలో శిక్షణ కోసం రైలులో ప్రయాణిస్తున్న సందర్భంలో గుర్తుతెలియని దుండగులు ఆ విద్యార్థిపై దాడి చేసి రైలు నుంచి బయటకు తోసేశారు. ఈ ఘటనలో విద్యార్థి తన రెండు కాళ్లను పూర్తిగా కోల్పోయాడు.ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో స్పందించి, ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ విద్యార్థికి అత్యంత అధునాతన కృత్రిమ కాళ్లను అమర్చే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాహుల్‌ను నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు 10 లక్షలకు పైగా వెచ్చించి ఆ యువకుడికి ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చారు. కొద్ది రోజులుగా ఒక్కో అడుగు వేస్తూ నడవడం ప్రారంభించిన రాహుల్ ఇప్పుడు సంపూర్ణంగా కోలుకుని ఆత్మ విశ్వాసంతో నడవగలుగుతున్నాడు. రెండు కాళ్లు కోల్పోయిన తనకు మళ్లీ నడవగలిగే విధంగా అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించిన ముఖ్యమంత్రి కి రాహుల్ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రాహుల్ భుజం తట్టి భవిష్యత్తులో బాగా చదువుకుని రాణించాలని ప్రోత్సహించారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపీ

### వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ అభివృద్ధి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హైదరాబాద్ లో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నిర్మాణానికి త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ బస్టాండ్ నిర్మాణం ద్వారా ప్రయాణీకులకు విశేష ప్రయోజనం చేకూరు తుందని అభిప్రాయ పడ్డారు. భూపాలపల్లి లో రైల్వే స్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్ పర్తి రోడ్ లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వే స్టేషన్‌లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజా ప్రయోజనంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు రావాలని సీఎంని కోరారు. అలాగే నష్కల్ నుండి హసన్‌పర్తి మరియు చింతల్ పల్లి నుండి నష్కల్ వరకు రెండు కొత్త రైల్వే బైపాస్ లైన్లను ప్రతి పాదించారని, ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లు వరంగల్ మాస్టర్ ప్లాన్ 2041కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రతి పాదనలు రాష్ట్ర ప్రభుత్వం గానీ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) గానీ స్థానిక ప్రతి నిధులను సంప్రదించ కుండానే తయారు చేయబడ్డాయని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రతి పాదనలను పునఃపరిశీలిం చడం ద్వారా ఓ ఆర్ ఆర్ ను ఆనుకుని రైల్వే మౌలిక సదుపాయాలను ప్లాన్ చేయాలని, అప్పుడు రైతుల సమస్య తీరుతుందని, ట్రాఫిక్ సమస్య ఉండదని, వరంగల్ నగర ప్రణాళికతో పాటు అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలసి వినతి పత్రం సమర్పించిన ట్లు వెల్లడించారు. రైల్వే అలైన్మెంట్ మార్పు విషయం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ సీఎం కి విజ్ఞప్తి చేసారు. వరంగల్ పార్లమెంటరీ నియోజక వర్గం లోని ఎంతో గొప్ప చారిత్రాత్మక దేవాలయాలైన శ్రీ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల ఆలయం తో పాటు చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం సహకరించాలని, కేంద్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా ఆలయాల అభివృద్ధిపై చర్చించి, అవసరమైన నిధులను త్వరగా మంజూరు చేసే విధంగా చూడాలని కోరారు. వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన దేవాలయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కోటగుల్లు (ఘణపూర్ దేవాలయాన్ని), నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణ ను వేగవంతం చేయాలని సీఎంని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి త్వరలో నే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి వినతి పత్రం అందజేస్తామని తెలియజేసారు.

# ఇండోర్ లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించిన మేయర్, కార్పొరేటర్లు, అధికారులు

### ● గ్యాస్ తయారీ అనంతర వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ



**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** స్టడీ టూర్ లో భాగంగా ఇండోర్ లో పర్యటిస్తున్న బల్దియా మేయర్, కార్పొరేటర్లు, అధికారుల బృందం మంగళవారం ఇండోర్ లో సుమారు 15 ఎకరాల్లో నిర్మించిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ యూనిట్ ను నగర మేయర్ గుండు సుధారాణి కార్పొరేటర్ లు అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ను పర్య వేక్షిస్తున్న అక్కడి అధికారులు ప్లాంట్ నిర్వహణ తీరును తెలియజేస్తూ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సిబిపి) యందు 550 టన్నుల తడి చెత్తను పిపిపి మోడ్ ద్వారా కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) గా మార్చడం జరుగుతుందని, దాదాపు ప్రతిరోజు 17 వేల కిలోల బయో గ్యాస్ ఉత్పత్తి అవుతుందని,15 ఎకరాల్లో ప్లాంటును ఏర్పాటు చేసి సేకరించిన తడి చెత్త ను వివిధ రకాల పద్ధతుల ద్వారా బయో గ్యాస్ గా మార్చి ఉత్పతి చేసిన గ్యాస్ ను వారి యొక్క రవాణా వాహనాలకు, పరిశ్రమలకు, గృహాల వినియోగానికి పంపించడం జరుగుతుం దని బయోగ్యాస్ అనంతరం మిగిలిపోయిన చెత్త (సాలిడ్ వేస్ట్) ను కంపోస్ట్ గా మార్చి అట్టి ఎరువును కూడా విక్రయించడం జరుగుతుందని ప్లాంట్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రీజ్వానా మసూద్, షమీమ్ వివిధ డివిజన్ లకు చెందిన కార్పొరేటర్ లు సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, సిహెచ్ఓ రమేష్, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్ రాడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.


# యాత్రదానం బస్సు సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోండి





**పరకాల, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** టీజీఎస్ ఆర్టీసీ వి.సి ఎం.డి సజ్జనార్ ప్రవేశపెట్టిన యాత్రదానం గూర్చి మరియు రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఆదేశానుసారంగా ఈరోజు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ని కలవడం జరిగినది . యాత్రదానం బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డిపో మేనేజర్ రాంప్రసాద్ లు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రారంభించిన యాత్రదానం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. దేశంలో ఏ ఆర్టీసీ సంస్థ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో యాత్రదానం కార్యక్రమాన్ని ప్రారంభించి అనాధలు, నిరాశ్రయాలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను వివిధ కార్యక్రమాలైన దైవదర్శనాలకు, విహారయాత్రలకు, పండుగలకు మరియు వైజ్ఞానిక యాత్రలకు, పుణ్యక్షేత్రాలకు తీసుకు వెళ్లడం ముఖ్య ఉద్దేశం అన్నారు. దాతల విరాళం ద్వారా ఆర్టీసీ యాత్రదానం సౌకర్యం కల్పించి వచ్చిన విరాళంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలోని పుణ్యక్షేత్రాలకు, పర్యటక ప్రాంతాలకు, వైజ్ఞానిక యాత్రలకు పంపించడం జరుగుతుందని అన్నారు.

# పూసూరు గ్రామా పంచాయితీలో విధి లైట్స్ కొరత




**వాజేడు, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** వాజేడు మండలం లోని పూసూరు గ్రామా పంచాయితీ లో వారం నుంచి విధి లైట్స్ పనిచేయకపోవడంతో రాత్రివేళలు చీకటిలో గ్రామస్తులు త్రివ ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు తెలియజేసినా పంచాయితీ సెక్రటరీ నిర్లక్షం వహిస్తూ గ్రామ పంచాయితీ లో నిధులు లేవు అంటూ సమాధానం ఇస్తున్నారు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,అదేవిదంగా వర్షాల కారణంగా విససర్పాలు తిరుగుతున్నాయి అని లైట్స్ లేకపోతే ఏమైనా ప్రమాదం జరగవచ్చు అని వారు చెబుతున్నారు. లైట్స్ లేకపోతే రాత్రివేళల్లో ప్రమాదం ఉంది అని చెబుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇకనైన విధి లైట్స్ మరమ్మతు చెయ్యాలి అని గ్రామస్తులు డిమాండ్ చేసారు.

# ములుగు మున్సిపాలిటీ కార్మికుడు మైధం మహేష్ కుటుంబానికి ఆర్థికసాయం





**ములుగు,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ కార్మికుడు మైధం మహేష్ కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు సిరిసిల్ల రామన్న ట్రస్ట్ ద్వారా రూ.5,50,000/- ఆర్థికసాయం అందజేశారు. జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణరావు, ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా ముఖ్యనేతలు, ములుగు టౌన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే జేడీ మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్, మండల యూత్ ప్రెసిడెంట్ మెర్రి రాజు యాదవ్, నా రోజు హరినాథ్, జన్ను శ్రీనివాస్, చిట్టి రెడ్డి శ్రీనివాసరెడ్డి, ములుగు జిల్లా యూత్ వింగ్ నాయకులు చోటు మొహమ్మద్ తదితరులు పాల్గొని కుటుంబానికి సంఘీభావం తెలిపారు.

# జిల్లాలో పత్తి సేకరణకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

### ● జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** మంగళవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తికి క్వింటాల్కు కనీస మద్దతు ధర రూ.8,110 గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ జిల్లాలో లక్షా 81 వేల 547 ఎకరాల్లో పత్తి సాగైందని,11,85,470 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశామని తెలిపారు. జిల్లా లోని 4 ఏఎంసి లలోని 27 జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్ల ను పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో పత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రమాణికమని, రైతులందరు తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం, కిసాన్ ఆప్ లో నమోదు చేసుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమా వేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా తూనికలు కొలతల అధికారి మనోహర్, సీసీఏ, విద్యుత్, రవాణా, పోలీస్ అధికారులు, ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌ని రాజకీయంగా ఎదుర్కోలేని కేటీఆర్...

- క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత బండి సంజయ్...
- కేటీఆర్ బెదిరింపులకు బండి సంజయ్ కుమార్ భయపడరు... దీటుగా జవాబు ఇస్తారు..
- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్..



**కరీంనగర్,సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రాజకీయ వ్యాఖ్యలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదుర్కునే దమ్ము ధైర్యం లేకుండా పోయిందని, అందుకే బండి సంజయ్ కుమార్ పై పరువు నష్టం కేసు వేశారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ కిందిస్థాయి నుండి అనేక రాజకీయ ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డ క్షేత్రస్థాయి దిగ్విజయ నేత అని తెలిపారు. కార్పొరేటర్ నుండి కేంద్రమంత్రి స్థాయికి వచ్చిన బండి సంజయ్ కుమార్ కు కేటీఆర్ కు రాజకీయంగా ఎంతో తేడా ఉందన్నారు. కెసిఆర్ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన కేటీఆర్ నాడు అధికార అహంకారంతో ఎంతోమందిని దుర్భాషలాడారన్నారు. బండి సంజయ్ కుమార్ ను కేటీఆర్ వ్యక్తిగతంగా విమర్శించి, దుర్భాషలాడిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. బండి సంజయ్ కుమార్ వాస్తలు విషయాలు మాట్లాడితే కేటీఆర్ జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నారని, అందుకే పరువు నష్టం దావా కేసులు వేశారని తెలిపారు.ముఖ్యంగా బండి సంజయ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఉన్న సమయంలో నాటి బి ఆర్ ఎస్ పై చేసిన వ్యాఖ్యలకు గతంలో కేటీఆర్ పరువు నష్టం కేసు వేశారని, నేడు కూడా అదే రీతిలో కేటీఆర్ మరొక పరువు నష్టం కేసు వేశారన్నారు. గతంలో వేసిన పరునష్టం కేసు కోర్టులో నిలబడలేదని, నేడు వేసిన కేసు కూడా అలాగే నీరుగారి పోతుందన్నారు. కేటీఆర్ రాజకీయ విమర్శలను, వ్యాఖ్యలను తట్టుకునే స్థితిలో లేరని అందుకే పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. కేటీఆర్ బెదిరింపులకు బండి సంజయ్ కుమార్ భయపడరని, దీటుగా బదులిస్తారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# కిక్ బాక్సింగ్ పోటీలలో విద్యార్థులు ప్రతిభ.




**పెద్దపల్లి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూన్యూస్):** వరంగల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఖైలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలలో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి శ్రీ ఆదర్శ యుపిఎస్ స్కూల్ విద్యార్థినిలు పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలు సాధించారు. వీరిలో కే.వర్షిని, వై. శాన్వి, ఎం.కృతిక, ఎస్. శ్రీహిత, పి. శాన్వి, జై. వర్షిత కిక్ బాక్సింగ్ లో అద్భుత నైపుణ్యం ప్రదర్శించారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ చిప్ప భాస్కర్, ప్రిన్సిపాల్ సుజాత, కిక్ బాక్సింగ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ బండారి సంతోష్, పెద్దపెల్లి జిల్లా కిక్ బాక్సింగ్ ఇంచార్జ్ కర్ర వెంకటేష్ అభినందించారు. మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

# నేటితెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించండి...

- ప్రతి పోలింగ్ బూత్‌లో జాతీయ జెండా. ఎగరవేయండి...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్,సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):**సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించాలని, జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో జాతీయ జెండా ఎగరవేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రను మరో మలుపు తిప్పిన రోజని, శతాబ్దాల బానిస సంఖ్యలను తుంచేసిన ఉద్విగ్న సందర్భమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడాదైనా ఇంకా స్వేచ్ఛ కోసం ఎదురు చూసింది కేవలం తెలంగాణ సమాజమేనన్నారు. నిజాం నిరంకుశత్వానికి,రజాకర్ల రౌడీల, దాష్టికానికి, బానిస బ్రతుకుల సంకెళ్ళకి విముక్తి జరిగి తెలంగాణ సమాజం నిజమైన స్వాతంత్రం పొందిన రోజు సెప్టెంబర్ 17 అని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని సొంత జాగీర్గా భావించి ఈ సంస్థానాన్ని పాకిస్తాన్లో కలపాలని చూసిన నిజాం రాజు కలలు కల్లలయిన రోజు సెప్టెంబర్ 17 అని ఆయన గుర్తు చేశారు. రజాకర్ వారసుల పార్టీ ఎంఐఎం అడుగులకు మడుగులోత్తే నేటి కాంగ్రెస్, నాటి టిఆర్ఎస్ సర్కార్లు విమోచన దినోత్సవ వేడుకలపై నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. సమైక్యత దినోత్సవం పేరుతో నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం , ప్రజాపాలన దినోత్సవం పేరుతో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవ స్ఫూర్తిని మంటలో కలపడమే మార్గంగా పెట్టుకుందని ఘాటుగా విమర్శించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారిక తెలంగాణ విమోచన వేడుకలు హైదరాబాద్లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# కాసిపేట మండలం నుండి ఇద్దరు ఉపాధ్యాయులకు పీఆర్టీయూ జిల్లా శాఖలో చోటు...





**మంచిర్యాల,సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):** పీఆర్టీయూ టీఎస్ మంచిర్యాల జిల్లా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కాసిపేట మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా కార్యవర్గంలో ముఖ్యమైన బాధ్యతలను అప్పగించింది.పీఆర్టీయూ టీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీ కొట్టె శంకర్ మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ బచ్చా మోహన్ రావు సంయుక్తంగా ఈ నియామకాలను ప్రకటించారు. ఈ నిర్ణయం ప్రకారం, కాసిపేటలోని టి.జి.ఎం.ఎస్. పాఠశాలలో పీజీటీ (తెలుగు)గా పనిచేస్తున్న శ్రీ అందె నాగమల్లయ్యను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. అదేవిధంగా, ఎం.పి.పి.ఎస్. ఓల్డ్ వరీ డేట్ లో ఎస్.ఈ.టిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీ నారాయణ తిరుపతిని జిల్లా కార్యదర్శిగా నియమించారు.ఈ ఇద్దరు ఉపాధ్యాయులు నేటి నుండి జిల్లా కార్యవర్గంలో పనిచేస్తూ, మండల కమిటీతో సమన్వయం చేసుకుంటూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని జిల్లా శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ నియామకాలు సంఘం బలోపేతానికి దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు.

# బెజ్జంకి మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన...

- ఇటీవల మరణించిన వారి కుటుంబాల పరిశీలన





**బెజ్జంకి, సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):** బెజ్జంకి మండలంలో మంగళవారం మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సుడిగాలి పర్యటన జరిపారు. మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో సంగెం రాజేందర్, దేవక్కపల్లి పంచాయతీ పరిధిలోని వెన్నవానిపల్లెలో పంజాల రాజవ్వ, తలారీవానిపల్లి లో ఎర్ల జ్యోతి మరణించగా, వారి కుటుంబాలని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. అంతేకాకుండా వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, పార్టీ నాయకులు చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, జెల్లా ప్రభాకర్, బైర సంతోష్, పులి సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, మచ్చ కుమార్, మచ్చ రాజేశం, కోరుకంటి రాములు, సందీప్, నవీన్, సాదిక్, ఎ.శ్రీనివాస్, రావుల నర్సయ్య, కనగండ్ల చంద్రయ్య, చిక్కుల అయిలయ్య, శీలం నర్సయ్య, మల్లేశం పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో పాఠ్యంశంగా చేర్చాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**రామడుగు, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో పాఠ్యంశంగా చేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా రామడుగు మండలంలోని గుండి గ్రామంలో రైతాంగ సాయుధ పోరాట అమరులు గుండి దామోదర్ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ భూమికోసం,భుక్తికోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని, 4500 మంది అమరుల ప్రాణత్యాగంతో నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు స్వాతంత్రంసిద్ధించిందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరులను స్మరించుకుంటూ వారి యొక్క పోరాట స్ఫూర్తితో యువ కమ్యూనిస్టులు పాలక ప్రభుత్వాల విధానాలపైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఉమ్మెంతుల రవీందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు గంటే రాజేశం, గుండి గ్రామ ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్, ముంజాల ప్రవీణ్ గౌడ్, మేకల నాగరాజు, దికొండ కుమారస్వామి, మచ్చ నరసయ్య ,ఏగుర్ల మల్లేశం, మచ్చ హరీష్ ,ఎండి అజీమ్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ కింద 39 మందికి రూ.10.40 లక్షలు మంజూరు...

- గుండ్లపల్లిలో చెక్కుల పంపిణీ...





**గన్నేరువరం,సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):**గన్నేరువరం మండలానికి చెందిన 39 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 10,40,500 రూపాయలు విలువ చేసే చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోగల రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వీటిని లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరు కోసం ఎదురు చూడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెనువెంటనే నిధులు మంజూరు చేస్తూ పేదలకు చేదోడువాదోడు నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 19 విడుతలుగా చెక్కులు పంపిణీ చేశామని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల తహశీల్దార్ నరేందర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి,జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ అలువాల కోటి, మాతంగి అనిల్ తోపాటు పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.**పరామర్శలు...** గన్నేరువరం మండలం ఇటీవల వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. గన్నేరువరం గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి పెద్దమ్మ చింతల వజ్రమ్మ, మాదాపూర్ గ్రామ కాంగ్రెస్ నేత గొడుగు స్వామి తండ్రి అయిలయ్య, గునుకుల కొండాపూర్ లో న్యాలపట్ల నర్సవ్వ మరణించగా, వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. ఈ పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, పులి కృష్ణ, కొమ్మెర దేవేందర్ రెడ్డి, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, మాతంగి అనిల్ తదితరులు ఉన్నారు.




# అనారోగ్యానికి గురైన కార్యకర్తలకు అండగా ఆందోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం నేడు గజవాడ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జంగం శివ కుమార్ స్వామి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్నీ తెలుసుకొని స్థానిక ముద్దు బిడ్డ మన ప్రియతమ నాయకులు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.వారికీ అన్నివిధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. వారి వెంట రేగోడ్ బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, గజవాడ గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, మహిళలు యువకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు. ఆందోల్బిమాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ రాయికోడ్ మండల బీఆర్ఎస్ టీంతో కలసి పాంపాడ్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ నివర్తికి ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. పంపాడ్ గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన ఒగ్గు నర్సింలు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక డ్రైవ్



**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారదా దేవి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన "స్వస్తినారి సశక్త పరివార్ అభయాన్" కార్యక్రమాలు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు తెలిపారు. బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దేశాయిపేట లో మంత్రి కొండ సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ఇట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తు న్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలలలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేట, ఎంజీఎం హాస్పిటల్, గవర్నమెంట్ ప్రభుత్వ హాస్పిటల్ నర్సంపేట నుండి గైనకాలజీ నేత్ర నిపుణులు, ఈఎన్టీ నిపుణులు, డెర్మటాలజీ, సైక్రియాటి, డెంటల్ సర్జరీ తదితర వైద్యులచే సేవలందిస్తామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి ఆరోగ్య సమస్యలను ఈ శిబిరాలలో పరీక్షలు చేయించుకొని తగు చికిత్సలు చేసుకోవాలని ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్ఓ సాంబశివరావు కోరారు.

# సినిమా నృత్యాలు డీజే సాంగ్స్ నిషేధించాలి..

**మాసం సుధాకర్ ఆర్టిఐ కార్యకర్త కలెక్టర్‌కు ఫిర్యాదు...**

**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** దుర్గ నవరాత్రి ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు. అశ్లీల డీజే సాంగ్స్ నిషేధించుటకై ఉత్సవ కమిటీలకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మాసం సుధాకర్ ఆర్టిఐ కార్యకర్త జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికు వినతి పత్రం అందజేశారు, కరీంనగర్ జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు మరియు సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో డీజే పాటలతో అశ్లీల పాటలతో మరియు అశ్లీల నృత్యాలతో చేస్తున్నటువంటి కార్యక్రమాలను నిషేధించాలని, సాంప్రదాయ పద్ధతిలో భక్తి పాటలతో భగవంతుడు నామస్మరణతో కార్యక్రమాలు చేయాలని, సద్దుల బతుకమ్మ రోజున సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలు ఆడాలని (డీజే) పాటలతో దిగజారిపోతున్న మన సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడే విధంగా మీరు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాల జారీ చేయాలని ప్రజల తరపున విజ్ఞప్తి చేశారు.



# లింగంపల్లి నుండి,అమీన్ పూర్ మీదుగా సుల్తాన్ పూర్ వరకు రేడియల్ రోడ్ సర్వే

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో సర్వే
- పాల్గొన్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణ ఐఏఎస్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు, శేరిలింగంపల్లి నియోజక వర్గం లోని లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్ పూర్ మీదుగా సుల్తాన్ పూర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ వరకు రేడియల్ రోడ్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వీ. కర్ణన్ తో కలిసి స్థలాన్ని పరిశీలించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ,నాలాగా మారిన చిన్న వాగులో ఆక్రమణలు తొలగించి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు.అమీన్ పూర్‌కు నేరుగా హైవే సౌకర్యం కల్పించేందుకు రహదారి నిర్మాణం అవసరమని స్పష్టం చేశారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా వద్ద హైవే నుంచి రింగ్ రోడ్ వరకు నేరుగా రహదారి నిర్మాణమే ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను వంద రోజుల్లో పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, వెంటనే అధికారులను కార్యాచరణ ప్రారంభించమని ఆదేశించారని ఎంపీ రఘునందన్ రావు గారు తెలిపారు.ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అమీన్ పూర్, సుల్తాన్ పూర్, బొల్లారం ప్రజలతో పాటు శేరిలింగంపల్లి వాసులకు కూడా రింగ్ రోడ్ ప్రయాణం మరింత సులభతరం అవుతుందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, నర్సింగ్ గౌడ్, సందెళ్ల ఆంజనేయులు, ఈర్ల రాజు ముదిరాజ్, కొండా లక్ష్మణ్ గుప్తా, రాచమల్ల సంతోష్ గౌడ్‌తో పాటు వివిధ కాలనీల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే 50 ఏళ్లకు సరిపడా సంగారెడ్డి సదాశివపేట ప్రజలకు స్కీం డిజైన్‌కు ఆదేశించిన జగ్గారెడ్డి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుతం, వచ్చే యాభై ఏళ్లకు సరిపడా సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో మంజీరా నీళ్ళు ప్రజలకు అందించడానికి వాటర్ స్కీమ్ ను డిజైన్ చేయాలని ఆదేశించిన జగ్గారెడ్డి.సంగారెడ్డి, సదాశివ పేట మున్సిపాలిటీలకు మంజీరా నీటి సరఫరాపై మున్సిపల్, పబ్లిక్ హెల్త్, అర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, జగ్గారెడ్డి సమీక్ష సమావేశం.ఈ నెల 30 లోగా మంజీరా వాటర్ స్కీమ్ కు సంబంధించి సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ రెడీ చేయండి.తక్షణ నీటి సరఫరా కోసం 15 కోట్ల రూపాయలతో తాళ్ళపల్లి ఫిల్టర్ బెడ్ ఆధునీకరణ, నాలుగు మండలాల్లో ట్యాంక్ లు, పైప్ లైన్ల మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు రూపొందించండి.వచ్చే నెలలో సంగారెడ్డి లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉంటుంది.

# తొర్రూరు టీజిఎస్ ఆర్‌టిసి బస్ డిపోలో బీసీ ఉద్యోగుల సంఘం తొలిసారి ఎన్నిక

- ముఖ్య అతిథుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు




**తోరూరు ప్రతినిధి, సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలిసారిగా బీసీ సంఘం ఎన్నికలు నిర్వహించడానికి ప్రాధాన్యత సంచరించుకుంది. వరంగల్ రీజినల్ లోని తొర్రూరు టీజీఎస్ ఆర్ టి సి బస్ డిపోలో తొలిసారిగా బీసీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్య అతిధులుగా వరంగల్ రీజినల్ అధ్యక్షుడు గోసల కొండ వేణు, వరంగల్ రీజినల్ వర్కింగ్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, వరంగల్ రీజనల్ కార్యదర్శి మాదారపు సాంబయ్య అధ్యక్షతన ఈ ఎన్నికలను నిర్వహించారు. తొర్రూరు టీజేఎస్ ఆర్టీసీ బస్ డిపోలో బీసీలు మొత్తం 80 మంది ఉండగా పోటీ లేకుండా ప్రతిపాదించిన పేర్లను మిగతా సభ్యులు ఓకే చేశారు. నేనంటూ ఎవరు పోటీ పడకుండా ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తొర్రూరు టీజీఎస్ ఆర్టీసీ బస్సు డిపోలో ఎన్నుకున్న వారిలో తోరూర్ డిపో అధ్యక్షులుగా గన్నోజు శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. (2). డిపో వర్కింగ్ అధ్యక్షులుగా చిట్యాల వనజ.(3). మరో అభ్యర్థి పొడ్డెల్లి యాకయ్య.(4). డిపో ఉపాధ్యక్షులు సింగారపు యాకన్న. చింతం రమేష్ కుమార్.(5). డిపో కార్యదర్శి సింగరం వెంకన్న.(6). డిపో సహాయ కార్యదర్శులు, రావుల సత్తయ్య, మరో అభ్యర్థి ఏసు లేటి నిర్మల.: (7)డిపో ఆర్గనైజింగ్ కార్యదర్శి, రాముల స్వప్న, మేడి రాజు.(8) డిపో గ్యారేజీ కార్యదర్శి :- జి భాస్కర్ (గట్టు) ఎంసి.(9). డిపో గ్యారేజీ సహాయ కార్యదర్శి:- టీ.ధనుంజయ్.(10). డిపో మీడియా కార్యదర్శి:- మారిపల్లి గోపి.(11). డిపో కోశాధికారి:- కొమ్మ గాని సంపత్ కుమార్.(12). కమిటీ సభ్యులు. పదిమందిని ఎన్నుకున్నారు. ఎం.వెంకన్న, జెకె. చారి, ఏ రవీందర్, జి. ఉమా,వి.రాజేశ్వరి, ఏ.విశ్వతేజ, జె.మాధురి, పి సుధీర్ వీరంతా కమిటీ సభ్యులు. టీ జి ఎస్ ఆర్ టి సి డిపోలోసారిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారందరికీ డిపోలో ఉన్న అధికారులు మిగతా సిబ్బంది వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పద్మావతి ప్రసంగిస్తూ వరంగల్ రీజినల్ లో డిపో అంటేనే మంచి గుర్తింపు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికైన వారిపై ఉందని అన్నారు. డిపోలో జరిగిన ఏ సమస్య అయినా ఎన్నుకున్న వారందరూ డిపో అభివృద్ధి కొరకు ఎలాంటి ప్రణాళికలు తయారు చేసుకొని డిపోను ముందుకు సాగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం పద్మావతి తో పాటు ఎంఎఫ్, ఎస్ టి ఐ రజిత, స్టేషన్ మేనేజర్ మల్లికార్జున్, మిగతా కంట్రోలర్లు, పదవిలో ఉన్న అధికారులు తోటి సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ల పై గుంతలు,పిచ్చి మొక్కలను తొలగించిన మహబూబాద్ జిల్లా పోలీసు యంత్రాంగం




**మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రమాదల నివారణకు రోడ్ల పై గుంతలు, పిచ్చి మొక్కలను తొలగించిన పోలీస్ అధికారులు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల్లో ఏర్పడిన క్రాక్స్, గుంతల ను మట్టితో పూడ్చి, రోడ్డు ఇరువైపులా పెరిగి అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించిడం జరిగింది. జాతీయ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారడం తో మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగి గుంతలు పుడ్చే కార్యక్రమం నిర్వహించడం జరిగింది .

# ప్రజా రక్షణే మా కర్తవ్యం...

## - సొంత ఖర్చులతో రోడ్డు గుంతలు పూడ్చిన కురవి ఎస్ఐ గండ్రతి సతీష్




**కురవి,సెప్టెంబర్ 16 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**ప్రజా రక్షణే మా కర్తవ్యం అని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు.మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు ఇటీవల కురవి మండలంలోనీ పెద్దతండా గ్రామ స్టేజి దగ్గర్లో, మొగిలిచర్ల గ్రామ సెంటర్లో, నారాయణపురం ఎక్స్ రోడ్, రాజోలు,బలపల గ్రామాల్లో భారీ వర్షాల వల్ల రహదారిపై గుంతలు పడటంతో వాటిని చూసి వెంటనే తనిఖీ చేసీ తన సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతలను మరమ్మతులు చేయించిన ప్రజా రక్షకుడు ఎస్సై గండ్రాతి సతీష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించి క్షేమంగా ఇంటికి వెళ్లాలని ఎస్సై గండ్రతి సతీష్ అన్నారు. అతనే ఒక సేవకుడిలా పార పట్టుకోని సిబ్బందులతో కలిసి గుంతలు ఉన్నచోట రాళ్లతో కూడిన డస్ట్ ను సదను చేశారు. పల్లెల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని స్వయంగా ఎస్సై గండ్రాతి సతీష్ చేస్తున్న పనులను చూసి మండల ప్రజలు అభినందించి,సోషల్ మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ క్రైమ్పై అవగాహన సదస్సు

**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** హన్మకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.సీపీ సర్ డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, సైబర్ బానిసత్వం వంటి సైబర్ నేరాలపై విద్యార్థుల కు అవగాహన కల్పించారు. అప్రమత్తత తో ఉండి ఇలాంటి మోసాలకు బలి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారుఈ కార్యక్రమానికి సుమారు 600 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు హాజరయ్యారు.



# హత్నూర పోలీస్ స్టేషన్లో ఆకస్మిక తనిఖీ చేసిన పారితోష్ పంకజ్









## వార్షిక తనిఖీలలో భాగంగా హత్నూర పోలీసు స్టేషన్ ను ఇన్స్పెక్షన్ చేసిన జిల్లా ఎస్పి

## పోలీసు స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, రికార్డ్స్ మెంటేనేన్స్ పరిశీలన.

## స్టేషన్ అధికారి, సిబ్బంది పని తీరు బాగుంది.

## జిల్లా ఎస్పి శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా హత్నూర పోలీసు స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ ఐపిఎస్, హత్నూర పోలీసు గౌరవ వందనం స్వీకరించి, డిఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేసి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డు లను తనఖి చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని సూచిస్తూ, స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన విలేజ్ పై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలతో యువతతో సత్:సంబంధాలను కలిగి ఉండాలని సూచించారు. స్టేషన్ పరిదిలో గల కేడి, సస్పెక్ట్, రౌడీ లను తరుచూ చెక్ చేస్తూ ఆన్లైన్లో నమోదు చేయాలని , అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేయాలని అన్నారు. ఆస్థి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను హాట్ స్పాట్స్ గా గుర్తించి, నిఘా కట్టుదిట్టం చేయాలని, నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ఏర్పాటు కృషి చేయాలని సూచించడం జరిగిందని అన్నారు.స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 -5 పెండింగ్ లేకుండా చూడాలని, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డైల్ -100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు.ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అందుబాటులోనికి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్,టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం,ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్,సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్,సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్,బాడీ ఓన్ కెమెరాల వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి,నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి ఆదేశించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించాలని అన్నారు.డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నన్ను కలవోచ్చని అన్నారు. పోలీస్ స్టేషన్,రికార్డుల మెయింటనెన్స్ బాగుందని ఎస్.హెచ్.ఓ శ్రీధర్ రెడ్డి, సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.ఈ తనిఖీ లలో ఎస్పి వెంబడి పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నయీం, సిసి విజయ్ పవార్ తదితరులు ఉన్నారు.

# రైల్వే నాలుగో నెంబర్ ప్లాట్ఫారం నిర్మించాలి

**● సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేత**



**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 16(పి.సి.డబ్ల్యూ న్యూస్):** పట్టణ కేంద్రంలోని రైల్వే నాలుగో నెంబర్ ప్లాట్ఫారం నిర్మించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది మంగళవారం రోజు మహబూబాద్ రైల్వే స్టేషన్ సందర్శన విచ్చేసినటువంటిరైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, డిఆర్ఎం గోపాలకృష్ణ విచ్చేయగా వారికి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సుర్నపు సోమయ్య మాట్లాడుతూ మహబూబాద్ పట్టణం రెండు భాగాలుగా పాత బజార్ కొత్త బజార్ గా విడిపోయి ఉన్నది దానిలో రైల్వే స్టేషన్ ఉన్నది కావున రైల్వే స్టేషన్లో మూడే ప్లాట్ఫారం ఉండడం వలన అటువైపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది అదేవిధంగా మూడవ లైన్ పనులు నెమ్మదిగా జరగడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అదేవిధంగా మహబూబాద్ జిల్లా కేంద్రంగా ఉండడం వలన చుట్టుపక్కల పరిసర ప్రాంత రవాణా సౌకర్య కొరకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో ఆశ్రయించాల్సింది కాబట్టి మహబూబాబాద్ లో వందే భారత్ ఎక్స్ప్రెస్, గరీబ్ రథ్ తోపాటు ప్రజల అవసరాలకు సరిపడు రైల్వేలను ఆల్టింగ్ ఇవ్వాలని కోరారు అదేవిధంగా, అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని, ఎంట్రెన్స్ ఒకటే ఉండడం వల్ల రైళ్లు వచ్చి వెళ్ళు సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కావున ఎంట్రెన్స్ను పెంచాలని కోరారు , అధికారులు స్పందించి నాలుగో నెంబర్ ప్లాట్ఫారం ఏర్పాటు చేయాలని, మూడో లైన్ పనులు త్వరగా ముగించాలని మౌనిక సదుపురి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, చీపిరి యాకయ్య, చాగంటి భాగ్యమ్మ, హేమ నాయక్, బానోత్ వెంకన్న, గౌన వెంకన్న తోట శ్రీనివాస్, మహమ్మద్ రజాక్, మందుల మహేందర్ పులిగుజ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలను ఆకస్మికంగా తనిఖీ

**యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**రైతులకు నీడ మంచి నీటి వసతులు కల్పించాలి.**

**హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్ గది, కిచెన్ షెడ్, పరిసరాలను పరిశీలించారు,**

**పిల్లలకు షెడ్యూలు ప్రకారం సూచించిన విధంగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, వైద్య పరీక్షలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**నరసింహలపేట ప్రాథమిక సహకార వ్యవసాయ సొసైటీ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 16(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మరిపెడ మండలంలోనీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలను పర్యటించారు, మరిపెడ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం యూరియా పంపిణీ కేంద్రాన్ని సందర్శించి సరఫరా చేస్తున్న ప్రక్రియను పారదర్శకంగా ప్రతి ఒక రైతుకు అందే విధంగా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు. వచ్చిన రైతులకు నీడ మంచి నీటి వసతులు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చెయ్యాలని సూచించారు.యూరియా అమ్మకాల రిజిస్టర్ ఎప్పటికి అప్పుడు నమోదు చెయ్యాలని యూరియా పంపిణీ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.మరిపెడ మండలంలో గిరిపురంలో ఉన్న కేజీబీవీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు, హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్ గది, కిచెన్ షెడ్, పరిసరాలను పరిశీలించారు, పిల్లలకు షెడ్యూలు ప్రకారం సూచించిన విధంగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, వైద్య పరీక్షలు, ప్రతి సబ్జెక్టు పై అవగాహన డిజిటల్ తరగతులు క్రీడా సాంస్కృతిక విభాగాలలో శిక్షణలో అందించాలని సూచించారు.కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏ విజయ్ చందర్, స్థానిక తహసిల్దార్ కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, ప్రాథమిక సహకార వ్యవసాయ సొసైటీ నరసింహలపేట, పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసింహుల పేటను సందర్శించారు.

# తెలంగాణ సాయుధ పోరాటంతోనే నిజాం సర్కార్ పతనం

**అమరులైన వీరుల స్మారక కేంద్రాలను ఏర్పాటుచేసి, సెప్టెంబర్ 17 విలీన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్**

**ఆత్మ కమిటీ చైర్మన్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు.నల్లు సుధాకర్ రెడ్డి**






**కురవి సెప్టెంబర్ 16(పి.సి.డబ్ల్యూ న్యూస్):** కమ్యూనిస్టులనాయకత్వంలో కొనసాగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంతోనే నిజాం సర్కార్ పతనమైందని ఆత్మ కమిటీ చైర్మన్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు.కురవి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి, అరుణ పతాకాన్ని ఎగురవేయగా ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని ఆర్ఎస్ఎస్ బిజెపి లాంటి శక్తులు చరిత్రను పెద్ద ఎత్తున వక్రీకరించే ప్రయత్నాలు కొనసాగిస్తూ, మతము రంగు పులిమే కుయుక్తులను ప్రగతిశీల శక్తులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు తెలంగాణ గడ్డపై భూమికోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వములో తిరుగుబాటు బావుటను ఎగురవేసి, భూస్వాముల కబంధ హస్తాలలో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, మట్టి మనుషులకు తిరుగుబాటును నేర్పించి భాంచన్ కాల్మొక్త దొర అన్న వారిచే బందూకులు పట్టించిన ఘనత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు.సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి, నాటి పోరాటంలో అమరులైన వీరుల స్మారక కేంద్రాలను ఏర్పాటుచేసి, సెప్టెంబర్ 17 విలీన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారుసిపిఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న అరుణ పతాకాన్ని ఎగరవేయగా, మండల కార్యదర్శి కరణం రాజన్న, కన్నె వెంకన్న, దూది కట్ల సారయ్య, దొంతు రామ్మూర్తి, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, బసవ కొమరయ్య, గజ్జి చంద్రయ్య, నాగేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం ప్రభుత్వం మరిచిపోయింది: గౌటి రామకృష్ణ

**అండగా ఉంటామని చెప్పడం తప్ప ఎక్కడ అండగా ఉన్నారో చూపించండి**

**ఆసుపత్రి పాలైన జర్నలిస్టులకు ఆసుపత్రి బిల్లు మొత్తం చెల్లించారా**

**ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా జర్నలిస్టులకు అందని మొత్తం సహాయం**

**జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి ఆదుకొనే దిక్కేలేదు**

**2సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ ఇవ్వలేదు, ఏంప్యానల్ చేయలేదు**

**అవార్డులు కాదు సమయానికి ఆర్థికంగా ఆదుకోండి చాలు**

**జర్నలిస్టులపై దాడులు చేసిన పట్టించుకోని పోలీసుల, ప్రజాప్రతినిధులు**

**జర్నలిస్టుల పై దాడి చేసిన వాళ్ళని రక్షిస్తున్న పోలీసులు, తిరిగి జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెడుతున్నా వైనం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టుల సమస్యలను తీర్చడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ పేర్కొన్నారు. సమాచారం శాఖామంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. చిన్న పత్రికలు ఏంప్యానల్ మెంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం నుంచి వేచి చూస్తున్నాయని మరి వాటిని ఎందుకు ఎంప్యానెల్ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ పాలన విధానాలనే రేవంత్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని అందులో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో అక్రిడేషన్ కార్డుల జారీలో భారీగా అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు కూడా సరిపోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసి తిరిగి వాళ్లపైన తప్పుడు కేసులు పెడుతుంటే పోలీసులు దాడి చేసిన వాళ్లకే సహాయం అందిస్తూ రిపోర్టర్లను శత్రువులుగా చూస్తున్నారన్నారు. జీతభత్యాలు దేవుడెరుగు అది వచ్చింది లేదు పోయేది లేదు దానికోసం కాలక్షేపం తప్ప జర్నలిస్టులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడంలో కేసీఆర్ సర్కారును మరిపిస్తున్నారని అదే కాకుండా ప్రభుత్వ అధికారుల అవినీతిని వెలికితీస్తున్న జర్నలిస్టులను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజమసం అన్నారు. అధికారుల అవినీతిని, నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని బయటకి తీయడం వల్లనే ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ విధానాలు ప్రజలలోకి వెళతాయని ఈ చిన్నపాటి విషయాన్ని కూడా ఎమ్మెల్యేల నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు మరిచిపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పదేపదే అనడం తప్ప వాళ్ల కోసం చేసింది శూన్యమన్నారు. మాటలు ఎన్నైనా చెప్పవచ్చని వాటిని అమలుపరచడం చేసినప్పుడే చెప్పిన మాటలకు సార్ధకత ఉంటుందన్నారు. జీవో ల ప్రకారం ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్లు కార్డులు ఇస్తే అదే అవార్డులు ఇచ్చినంత గొప్ప అని ఇక అవార్డులు ఇచ్చిన జర్నలిస్టులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తిస్థాయిలో బిల్లు చెల్లిస్తే అదే వాళ్లకు పెద్ద అవార్డు అని వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని తెలిపారు. అనారోగ్యాల పాలవుతున్న జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తి మొత్తం చెల్లించి సంక్షేమం కోసం పాటు పడతామని చెబితే బాగుంటుందని ఈ సందర్భంగా సమాచారం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి కి గౌటి రామకృష్ణ సూచించారు. ఇప్పటికైన రేవంత్ సర్కార్ స్పందించి జర్నలిస్టులపై మాటిమాటికి ప్రకటన చేయడం కాకుండా వాటిని అమలు చేయడం చేస్తే బాగుంటుందని కోరారు.



# కలోత్సవాలు, టీ. యల్. యం. మేళాలు విజయవంతం...

**● సందర్శించిన జమ్మికుంట తహసిల్దార్.**

**● ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారి.**






**జమ్మికుంట,సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతిని కళ్ళకు కట్టేటట్లుగా ప్రతిబింబించే విధంగా జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాలలో కలోత్సవాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తి (క్రియేటివిటీ) ని వెలికితీయడమే ఉపాధ్యాయుల విధి అని జమ్మికుంట మండల విద్యాశాఖ అధికారి హేమలత మేడం ఈ కలోత్సవాల ప్రారంభం సందర్భంగా సూచించారు. ఈ కలోత్సవాలను , టి.ఎల్.ఎం మేలను నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అభివర్ణించారు. తదనంతరం జమ్మికుంట తహసిల్దార్ వెంకటరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై టిఎల్ఎం మేళా లో భాగస్వాములు కావడం జరిగింది. ఇట్టి టి.ఎల్.ఎం.మేళాకు జమ్మికుంట మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారుచేసిన టిఎల్ఎం భోధనోపకరణాలను ప్రదర్శించి వారి ప్రతిభను కనబరిచారు. ఇట్టి కరోత్సవాలు టి.ఎల్.ఎమ్ మేళాలో జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేసినారు. కలోత్సవాల మేళాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలను మండల విద్యాధికారి హేమలత మేడం ప్రకటించారు. ప్రథమ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఆబాది), ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జమ్మికుంట బాయ్స్, తృతీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనుగుల. ఇట్టి కళోత్సవాలు, టిఎల్ఎం మేలా కు ఆదిత్యం ఇచ్చిన జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు కు మండల విద్యాశాఖ అధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే

**తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులపై ప్రస్తావించారు**

**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అభినవ్ అవినాష్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. తొరూర్ మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్లు మరియు సిసి డ్రెయిన్ పనులు పండుగల దృష్ట్యా అత్యవసరంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ గృహాలు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, వాటి నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అంతేకాకుండా, తొరూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ను పూర్తి చేసి త్వరగా ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలని జిల్లాకలెక్టర్ ని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రసంగిస్తూ ప్రజలకు లబ్ది చేకూరే పనులు పెండింగ్లో ఉండకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనులను నిరంతరాయంగా పూర్తి చేసి, ప్రజలకు సౌకర్యాలు కల్పించటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే అభ్యర్ధనపై సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.





# ప్రజా పాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి :: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు సెప్టెంబర్ 16(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. ఈ నెల 17న కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరగనున్న వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ “సెప్టెంబర్ 17వ తేదీ ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించాం. గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిషరించాలి. పండుగ వాతావరణంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి” అని అన్నారు. **ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాల షెడ్యూల్ :** ఉదయం 9:45 గంటలకు జిల్లా ఎస్పీ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు.ఉదయం 9:50 గంటలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ హాజరవుతారు.ఉదయం 9:55 గంటలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేరుకుంటారు.ఉదయం 10:00 గంటలకు మంత్రి సీతక్క జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేస్తారు.ఉదయం 10:05 గంటలకు గౌరవ వందనం స్వీకరిస్తారు.ఉదయం 10:10 గంటలకు మంత్రి సీతక్క ప్రజా పాలన దినోత్సవం పై ప్రసంగిస్తారు.ఈ వేడుకలకు అధికారులు, ప్రజలు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ దివాకర టి.ఎస్ కోరారు.

# బల్మూర్ వెంకట్ చొరవతో మేకల ఓదెలు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ




**హుజురాబాద్, సెప్టెంబర్ 16(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలోని శాలపల్లి ఇంద్రనగర్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మేకల ఓదెలు (తండ్రి కొమురయ్య) కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు లభించింది. ఈ చెక్కును పంపించడంలో డా. ఎంఎల్సీ బల్మూర్ వెంకట్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ చెక్కును ఓదెలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అరుకుటి విష్ణు చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల కష్టాలను గుర్తించి సహాయం అందించడంలో బల్మూర్ వెంకట్ ఎల్లప్పుడూ ముందుంటారని, ఈ సహాయం ఓదెలు కుటుంబానికి కొంతమేర ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో శాలపల్లి ఇంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరాపల్లి రాకేష్, హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల అరవింద్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాచపల్లి ఓదెలు, మ్యాకల నాగరాజుతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సహాయం అందించినందుకు మేకల ఓదెలు కుటుంబ సభ్యులు డా. బల్మూర్ వెంకట్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు సమాజంలో ప్రజలకు ప్రభుత్వాలపై నమ్మకాన్ని పెంచుతాయని నేతలు పేర్కొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

**డిఎస్ఎఫ్ఐ జాతీయకన్వీనర్ డాక్టర్ వివేక్ సహాయం**

**భవిష్యత్తు లోనూ పాప చదువు విషయంలో సహాయంగా ఉంటానని హామీ...**

**డాక్టర్ వివేక్ పంపించగా అరక్వింటాబియ్యం, వెయ్యిరూపాయల నగదును అందజేసిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్**



**కురవి సెప్టెంబర్ 16(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలకేంద్రానికి చెందిన దూదికట్ల రఘు(42) అనే ఓ నిరుపేద వడ్రంగి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు.. అతనికి భార్య, ఒక కూతురు ఉన్నారు. పాప ప్రస్తుతం పెద్దపల్లి గవర్నమెంట్ కాలేజ్ లో టిటిసి చేస్తుంది. కుటుంబ యజమాని ని అకస్మాత్తుగా కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిన ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న డిఎస్ఎఫ్ఐ జాతీయకన్వీనర్ డాక్టర్ వివేక్ మానవత్వంతో స్పందించారు. తక్షణ సహాయంగా అరక్వింటాబియ్యం, రూ.1000/- నగదును అందజేసారు. భవిష్యత్తు లో పాప చదువు విషయంలో అండదండగా ఉంటామని హామీ ఇచ్చారు. డిఎస్ఎఫ్ఐ జాతీయకన్వీనర్ డాక్టర్ వివేక్ తాను అందుబాటులో లేకపోవడంతో తనవంతు సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేయవలిసిందిగా కోరగా టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జర్నలిస్ట్ వీరన్న, మాజీ వార్డ్ సభ్యుడు దూదికట్ల సారయ్య లు కురవిలో వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులకు అందజేసారు. ఆ నిరుపేదకుటుంబం డాక్టర్ వివేక్ కు ధన్యవాదాలు తెలిపారు.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి...

**- పంచాయతీ రాజ్ అధికారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశం**




**మానకొండూర్, సెప్టెంబర్16(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీరాజ్ అధికారులు ఆదేశించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితితోపాటు వివిధ అభివృద్ధి పనులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలు,వరదల వల్ల మానకొండూర్ నియోజకవర్గం వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల గురించి ఎమ్మెల్యే అధికారుల నుంచి ఆరా తీశారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తుల విషయమై ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపారా అని ఆయన సమావేశంలో ప్రశ్నించారు. మండలాల వారీగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ రహమాన్, డెప్యూటీ ఈఈలు మంజులాభార్గవి, రవి ప్రసాద్, ఏఈలు సురేందర్ రెడ్డి, ప్రవీణ్, మల్లేశం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలలో ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించకపోతే రాజీనామా చెయ్యండి: యెచ్చు సునీల్



**హైదరాబాద్ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలల్లో విద్యా వైద్యం రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా అందించ లేకపోతే రాజీనామా చేయండి అంటూ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాష్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా శాలువ కప్పి మంత్రి వర్గంలో చర్చలు జరపాలని కోరడం జరిగింది, ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రంలో ఉద్యమం ను ఉదృతం చేస్తామని తెలిపారు. కార్పొరేట్ సంస్థలల్లో ఉచిత మెరుగైన విద్య,నాణ్యమైన వైద్యం అందేంత వరకు విద్యార్థుల రాజకీయ పార్టీ పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు గోకికరు అనిల్, ఎడ్ల నరేష్, మాధవ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు అండగా నిలిచిన కేటీఆర్... 5 లక్షల ఆర్థికసాయం



**ములుగు సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతున్న పులుసం పురుషోత్తం కు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు ఆర్థిక సహాయం అందించారు. ఈ రోజు పంబాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పురుషోత్తం గారికి ?5,00,000/- ఆర్థిక సాయాన్ని నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి గారు, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు అందజేశారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ – "కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకోవడం టిఆర్ఎస్ పార్టీ ధర్మం. కష్టాల్లో ఎప్పుడూ అండగా నిలుస్తాం" అని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ – "ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు భరోసా కల్పించే పార్టీ మన టిఆర్ఎస్" అని తెలిపారు. లివర్ సమస్యతో బాధపడుతున్న పులుసం పురుషోత్తం మాట్లాడుతూ – "కేటీఆర్ గారు ఇచ్చిన మాట నిలబెట్టుకుని 5 లక్షల రూపాయల ఆర్థికసాయం అందించారు. జీవితాంతం పార్టీకి రుణపడి ఉంటాను" అని భావోద్వేగంతో అన్నారు. కార్యక్రమంలో పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, మండల అధ్యక్షుడు దండగుల మల్లయ్య, మాజీ జెడ్పిటిసి రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, ఆత్మ చైర్మన్ దుర్గమ్మ రమణయ్య, మాజీ మండల అధ్యక్షులు దిద్ది మోహన్ రావు, నుశెట్టి రమేష్, మాజీ సర్పంచులు జాజ చంద్రం, పులి నరసయ్య, సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓబు నాగేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య, మాజీ కోఆప్షన్ మెంబర్ దిలావర్ ఖాన్, మాజీ ఎంపీటీసీ దానక నర్సింగరావు, మాజీ ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల ఆపద బాంధవ్యుడు యలమందల జగదీష్

**మాదారపు నరసమ్మ కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఆర్థిక సాయం అందజేత**



ఖమ్మం, సెప్టెంబర్ 16 (పి సి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): ఆపద సమయంలో ఆదుకున్న వారే నిజమైన ఆత్మీయులు అన్నారు మహానుభావులు. ఖమ్మం జిల్లా, తల్లాడ గ్రామానికి చెందిన మాదారపు సైదులు ప్రమాదంలో మరణించడం, ఆయనకు భార్య నలుగురు కుమార్తెలు ఉండడంతో విషయం తెలుసుకున్న నాయి బ్రాహ్మణుల సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు సహాయంగా మంగళవారం 3 వేల రూపాయల నిత్యవసర సరుకులు, 2 వేల రూపాయల ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. ప్రతి మనిషి సహాయం చేసే గుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం దైవ లక్షణం అన్నారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి తన వంతుగా సహాయం అందించడం జరిగిందన్నారు. ఇలానే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు స్పందిస్తే ఆ కుటుంబానికి కొంతైనా ఆర్థిక భారం తీరి, భర్త లేని లోటు కూడా ఉండదనే విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణుల జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం





**వాజేడు. సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ఐటిడిఏ భద్రాచలం పీఓ రాహుల్ ఐఏఎస్ గారి ఆదేశాల మేరకు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాధపురం గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు (గైనకాలజిస్ట్), పిల్లల వైద్య నిపుణులు (పిడియాట్రిషన్), జనరల్ మెడిసిన్ నిపుణులు పాల్గొని గ్రామ ప్రజలకు వైద్యసేవలు అందించారు. అదనంగా ఉచిత కంటి పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 561 మంది రోగులు వైద్య సేవలు పొందగా, వారిలో పిడియాట్రిక్ విభాగంలో 82 మంది, జనరల్ మెడిసిన్ విభాగంలో 390 మంది, గైనకాలజీ విభాగంలో 30 మంది, ఆప్టాల్మిక్ విభాగంలో 50 మంది రోగులు చికిత్స పొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిధులు (అదనపు DM&HO ITDA భద్రాచలం), డాక్టర్ కీర్తి కుమార్ (డిప్యూటీ DM&HO ITDA ఎటురునాగారం) పర్యవేక్షణలో, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ మనోజ్ లాల్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ రిధిమా (గైనకాలజిస్ట్), డాక్టర్ రవితేజ (పిడియాట్రిషన్) తదితరులు వైద్యసేవలు అందించారు. అలాగే డాక్టర్ మహేందర్ , వాజేడు), డాక్టర్ మాధుకర్ , డాక్టర్ గ్నానసా కోటి రెడ్డి , వెంకటనర్సమ్మ రాఘవ్ (ఫార్మసిస్ట్), రాహుల్ (ఆప్టోమెట్రిస్ట్) తో పాటు నర్సింగ్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు చురుకుగా పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

**● జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి**




**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి మంగళవారం టిజిఆర్ఎస్ హసన్ పర్తి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినిల డార్మెటరీలు, డైనింగ్ హాల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, వెల్నెస్ రూమ్ ప్లే గ్రౌండ్, ను పరిశీలించారు, బాలికల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. సివేజ్ సమస్య ను, అడిషనల్ వాష్ రూమ్ ల గురించి సంబంధిత డి ఈ కి తెలియజేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు, సోషల్ సబ్జెక్ట్ సంబంధించిన ప్రశ్నలు అడిగారు. సమాధానాలు చెప్పిన విద్యార్థినులను అభినందించారు. మండల విద్యాధికారి ఏ. శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ ఇందుమతి, ఇన్చార్జ్ రాజకుమారి, ఇతర ఉపాధ్యాయులు మరియు సిఆర్పి రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

# తెల్లాపూర్ మున్సిపాలిటీలో అంగరంగ వైభవంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో గల కొల్లూరు ఫేజ్-1 డబుల్ బెడ్రూం ప్రాంగణంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఎంతో వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి గారితో కలిసి బిఆర్ఎస్ యువ నాయకుడు సాయిచరణ్ గౌడ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. సాయిచరణ్ గౌడ్ మాట్లాడుతూ మతపరమైన ఐక్యత, సోదరభావం, సేవామార్గం గురించి హజ్రత్ మహమ్మద్ ప్రవక్త బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

# నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం

**- నిర్వాసితుల కోసం రూ.23 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**రామడుగు,సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండినియోజకవర్గంగంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన నారాయణపూర్, మంగపేటగ్రామస్తులునారాయణపూర్, మంగపేట గ్రామస్తులతో స్వయంగా మాట్లాడి భరోసా కల్పించిన ఎమ్మెల్యేఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్, మంగపేట గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను గంగా ధరలోని ప్రజా కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం అందించడానికి ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని భరోసా కల్పించారు. ఇచ్చిన మాట ప్రకారం నారాయణపూర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి నిర్వాసితులు ఆందోళనకు గురికా వద్దని, అన్ని రకాలుగా అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# యువత నేతృత్వంలో, బాల వికాస భాగస్వామ్యంతో గ్రామీణ వర్గాలను మారుస్తుంది






**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** ఐఎస్ఓ ధృవీకరించబడిన ప్రపంచ లాభా పేక్షలేని బాల వికాసా సహకారంతో గ్రేడ్ 12 విద్యార్థి అర్ష్ హెూరా నేతృత్వం లోని జీవాంధార చొరవ ప్రాంతం రాష్ట్రంలోని గ్రామీణ వర్గాలకు స్థిరమైన మార్పును తెస్తోంది. గత రెండు సంవత్సరాలుగా, ఈ యువత నేతృత్వం లోని ప్రయత్నం నీరు, ఆర్థిక అక్షరాస్యత మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు మెరుగైన ప్రాప్యత ద్వారా ఏరియా పేరు లోని గ్రామాలలో కుటుంబాలకు అధికారం ఇచ్చింది. బాల వికాసా మరియు స్థానిక వర్గాలతో కలిసి పని చేస్తున్న ఆరి, గృహాలు తమ మొదటి బ్యాంక్ ఖాతాలను తెరవడానికి, ఆర్థిక అక్షరాస్యత వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి మరియు స్థానిక భాషలో హ్యాండ్‌బుక్ లను పంపిణీ చేయడానికి సహాయపడ్డాయి. బాల వికాసా అట్టడుగు అభివృద్ధి మరియు జీవాంధార యువత తో నడిచే శక్తిలో దశాబ్దాల నైపుణ్యం ఉన్నందున, ఈ భాగస్వామ్యం సమగ్ర, స్థిరమైన జోక్యాలు గ్రామీణ జీవితాలను ఎలా మారుస్తాయో ఒక నమూనాగా మారింది. కుటుంబాలు వారి ఆర్థిక వ్యవస్థను చూసుకోవడం మరియు స్థిరమైన పరిష్కారాలను స్వీకరించడం చాలా నెరవేరుతోంది అని జీవాంధార వ్యవస్థాపకుడు అర్ష్ హెూరా అన్నారు. ఈ ప్రయాణం నాకు నిలకడ మరియు సమాజ నేతృత్వం లోని మార్పు శక్తిని చూపించింది. బాల వికాసా వద్ద, కమ్యూనిటీలు దారి తీసినప్పుడు శాశ్వత మార్పు వస్తుందని మేము చూశాము. అర్ష్ ఇంత చిన్న వయస్సు లోనే అభిరుచి ఉద్దేశ్యం యొక్క అరుదైన కలయికను తెస్తుంది. జీవాంధారాతో, యవ్వన శక్తితో ఎలా చూపించాడో, బాల వికాసా గట్టి నైపుణ్యం తో జత చేసినప్పుడు, ఆచరణాత్మక, మరియు చివరిగా నిర్మించిన పరిష్కారాలను అందించ గలదు అని బాల వికాసా జీవాంధర గురించి యువతతో నడిచే చొరవ, నీరు, ఆర్థిక అక్షరాస్యత మరియు జీవనోపాధి రంగాలలో ఆచరణాత్మక, స్థిరమైన పరిష్కారాలతో గ్రామీణ సవాళ్లను పరిష్కరించడానికి కట్టుబడి ఉంది. బాల వికాసా అనేది ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన, ఐసో-సర్టిఫికేట్ పొందిన లాభా పేక్షలేని గ్రామీణ భారతదేశాన్ని మూడు దశాబ్దాలుగా సమాజ-ఆధారిత అభివృద్ధి, సామర్థ్యం పెంపొందించడం మరియు వినూత్న జీవనోపాధి కార్యక్రమాల ద్వారా మారుస్తుంది అని తెలియజేశారు.

# గాంధీజీ లక్ష విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

**• పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డిలు..**




**తొర్రూరు ప్రతినిధి,సెప్టెంబర్ 16(పీసీడబ్లు న్యూస్):** పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా మహాత్మా గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యేయశస్విని రెడ్డి తో పాటు , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, అక్టోబర్ 10, 11, 12, 13 తేదీలలో హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో జరగబోయే మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు మరియు స్వదేశీ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ని ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యం, సమానత్వం ఈనాటి సమాజానికి అత్యంత అవసరం. కొత్త తరానికి ఆయన ఆలోచనలు, జీవన విధానాన్ని పరిచయం చేయడం ఎంతో గొప్ప కార్యక్రమం. అక్టోబర్‌లో జరగబోయే ఈ జాతీయ సదస్సు విజయవంతం కావడానికి అందరం కలిసి కృషి చేయాలి అని పేర్కొన్నారు. అలాగే టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ విగ్రహాల ప్రదర్శన ద్వారా ప్రతి ఇంటికీ, ప్రతి మనసుకీ శాంతి, గాంధేయం చేరుతుంది. ఇలాంటి కార్యక్రమాలు గాంధీజీ ఆత్మను సజీవంగా ఉంచుతాయి అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పటాన్చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్ మెట్టు









**• పాల్గొన్న జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం 113వ డివిజన్లో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ తో కలిసి డివిజన్ పరిధిలోని కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్. రోడ్లపై చెత్త వేయకూడదని ప్రజలకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించిన జిహెచ్ఎంసి సిబ్బంది. పటాన్చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఈరోజు ఉదయం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్, శానిటేషన్ సూపర్వైజర్ పవన్, రాంకీ విజయ్ లతో కలసి పర్యటించడం జరిగింది. డివిజన్ పరిధిలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డు పక్కన చెత్తను బహిరంగ ప్రదేశంలో పడేయడం వల్ల డంపింగ్ యార్డ్ లా మారుతుందని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు, వ్యవసాయ మార్కెట్ యార్డులో కూరగాయలు అమ్ముకొని, మిగిలిన కూరగాయలను ఆటోలో వచ్చి అక్కడ పడవేస్తుండగా కార్పొరేటర్ నట్టు కుమార్ యాదవ్ జిహెచ్ఎంసి సిబ్బందితో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని వారిని మందలించి, మరొకసారి ఇలా చెత్తను రోడ్లపై విసరకూడదని హెచ్చరించారు. చెత్తను రోడ్లపై పారవేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి విష జ్వరాలు ప్రబలుతాయని అవగాహన కల్పించారు. శాంతి నగర్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కాలనీలో రెండు ఇండ్ల మద్యలో గల ఖాళీ స్థలంలో చెత్తను పారవేస్తున్నారని గమనించి, జిహెచ్ఎం సి సిబ్బంది చెత్త వేస్తున్న ప్రదేశాలను గమనిస్తూ, ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో చెత్తను పారవేస్తున్నట్లైతే రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని ఫోటో తీసి,వారికి జరిమాన విధించాలని ఆదేశించారు. పేరుకున్న చెత్తను జిహెచ్ఎంసి సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం శాంతి నగర్ కాలనీలోని బతుకమ్మ ఘాట్ ను పరిశీలించిన కార్పొరేటర్ రానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఘాట్ ను సిద్ధం చేయాలని, పిచ్చి మొక్కలు,చెత్తా చెదారాన్ని తొలగించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జిహెచ్ఎంసి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్, శానిటేషన్ సూపర్వైజర్ పవన్, రాంకీ విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరండివిజన్ పరిధిలోని యాదవ్ శ్మశాన వాటికలో 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన సిసి ప్లాట్ఫారం నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్. పటాన్చెరు డివిజన్ పరిధిలోని యాదవ సంఘం శ్మశాన వాటికలో జిహెచ్ఎంసి నిధులు 40 లక్షల రూపాయలతో నూతన ంగా నిర్మిస్తున్న సీసీ ప్లాట్ఫారం నిర్మాణ పనులను ఈ రోజు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గారు పరిశీలించడం జరిగింది. ఎత్తు పల్లాలు లేకుండా నాణ్యతతో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్ ను ఆదేశించడం జరిగింది.

# తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని హరీష్ రావుకు అందించిన మాణిక్ యాదవ్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం చేసుకున్న సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్. తిరుమల క్షేత్రం నుండి స్వామివారి లడ్డూ ప్రసాదం, తులసి తాళి స్వయంగా తీసుకొని వచ్చారు. ఆ దివ్య ప్రసాదాలను మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కి పటాన్చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి,పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,మాజీ జెడ్పిటిసి కొలను బాల్ రెడ్డి,తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి లకు అందజేయడం జరిగింది. ప్రతి ఒక్కరికీ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దయాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

# అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం





**• సుజాతా విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి**

**హన్మకొండ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యు న్యూస్):** 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి యందు అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం కార్య క్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతపై కరపత్రం లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమస్త జీవ రాశుల మనుగడకు అనుకూలమైన వాతా వరణమును భూ గోళానికి ప్రకృతి ప్రసాదించిన వరం అటువంటి వాతావరణాన్ని మానవుని ఆధునిక భోగలాలస జీవితాల కోసం కలుషితం చేస్తున్నామని తద్వారా వాతావరణంలో క్లోరోఫ్లోరో కార్బన్లు పెరిగి వాతావరణానికి గొడుగు లాగా రక్షణ కల్పిస్తూ మనందరి మనుగడకు మూలాధారమైన ఓజోన్ పొరాకు రంధ్రం పడి సూర్య రష్మి నుండి వచ్చే అల్ట్రా వైలెట్ కిరణాలు వాతా వరణంలో కలిసి భూమిపై నివసించే జీవరాశుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతున్నదని అన్నారు. వాతావరణం కాలుష్యానికి దారి తీసే రిఫ్రిజిరేటర్లు ఎయిర్ కండిషన్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు క్లోరో ఫ్లోరో కార్బన్లు విడుదల చేసి ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి మన దేశంలో విచ్చల విడిగా వాడుతున్న ప్లాస్టిక్ పదార్థాల వల్ల 10 లక్షల మరణాలు ప్రతి సంవత్సరం సంభవిస్తున్నా యని 55 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తగల బెట్టడం 35 లక్షల టన్నుల ప్లాస్టిక్ సీసాలు కవర్లను భూమి నీటిలో వేయడం ద్వారా వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి మొట్ట మొదటిసారిగా 1985 సంవత్సరంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఓజోన్ పొరకు రంధ్రాన్ని కని పెట్టారని ఈ ఓజోన్ పొర రంధ్రం ఏర్పడితే సమస్త జీవరాసులకు ప్రమాదమని ఐక్యరాజ్యసమితి 1994వ సంవత్సరము జనరల్ అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా 1995 సెప్టెంబర్ 16 నుండి అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం జరుపుకుంటు న్నామని 1987 సెప్టెంబర్ 16 న మాంట్రియల్ లో జరిగిన సమావేశంలో ఓజోన్ పొర పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ సంతకాలు చేయడం ద్వారా ఓజోన్ పొర ప్రాముఖ్యతను గుర్తించడం జరిగినదని తెలిపినారు సెప్టెంబర్ 16 2025 థీమ్ ఓజోన్ ఫర్ లైఫ్ ఈ అంశం మన గ్రహానికి భర్తీ చేయ లేని కవచంగా ఓజోన్ పొర నిరంతర ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. మరియు మాంట్రియల్ ప్రోటోకాల్ ప్రపంచ విజయం మరియు భవిష్యత్తు సామర్థ్యాన్ని జరుపుకుంటుంది ప్రపంచ ఓజోన్ దినోత్సవం నాడు పర్యావరణ అనుకూలం కావున మనందరం కూడా ఓజోన్ పొర పరి రక్షణకు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్లాస్టిక్ పదార్థాలను నిత్య జీవితంలో వినియోగించ కూడదని విరివిగా చెట్లను నాటి పరి రక్షించాలని విద్యార్థులను కోరినారు మన పాఠశాల ఎన్జిసి యూనిట్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు వన మహోత్సవ కార్య క్రమం ద్వారా ప్రతి సంవత్సరం ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి వాటిని సంరక్షించడం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయడం కాలుష్య రహిత దీపావళి హెూలీ పండుగలు జల సంరక్షణ ప్లాస్టిక్ ను నిషేధించడం పై అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని మన కార్య క్రమాలను గుర్తించి ఆరు పర్యావరణ మిత్ర జాతీయ అవార్డులు మాజి రాష్ట్రపతి డా. అబ్దుల్ కలాం మరియు ఇతర పెద్దలచే పొందడం జరిగినదని ఇకముందు కూడా పాఠశాల ఎన్జిసి ఆధ్వర్యంలో పర్యావరణ పరి రక్షణకు ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపినారు తదనంతరం విద్యార్థులచే ఓజోన్ పొర పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది పాఠశాల ఆవరణలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులచే మొక్కలు నాటడం జరిగినది విద్యార్థులకు తల్లి దండ్రులకు కర పత్రములు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, పి. వెంకటేశ్వర్లు, ఈ. ప్రవీణ్, వి. అచ్యుత్ రెడ్డి, రాధా కుమారి, సబిహా, అరుణ, సుచిత్ర, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమం

**పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ వద్ద మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించిన విందు కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్‌లకు కేసీఆర్ పేరు పెట్టడం ప్రజలకు గర్వకారణం అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెట్టింపు పన్నులు,రెట్టింపు విద్యుత్ చార్జీలతో పేదలను వేధిస్తోంది అని అన్నారు. అలాగే, ముస్లింల కోసం షాదీ ముబారక్ వంటి పథకాలు తీసుకొచ్చి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించి, అభివృద్ధి పథంలో ముందుకు నడిపింది బిఆర్ఎస్ ప్రభుత్వం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టకపోగా, ఇప్పటికే ఉన్న వాటిని సరిగా నిర్వహించకపోవడంతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది" అని విమర్శించారు. అదే విధంగా, "ఇస్తామన్న తులం బంగారం, మహిళలకు స్కూటీలు, విద్యా భరోసా కార్డు, పేదల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ అమలు చేయకపోవడం దారుణం. పేదలను ఇలా వేధించడం సరికాదు. రానున్న రోజులు మనవే... అందరూ ధైర్యంగా ముందుకు సాగాలి. ఏ సమస్య వచ్చినా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది" అని అన్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ప్రజలతో ఎల్లప్పుడూ ఉంటూ, వారి సమస్యలు పరిష్కరించడానికి కట్టుబడి ఉంది. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితం వల్లే నేటి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించింది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి, సాయి గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘కిష్కింధపురి’పై మెగాస్టార్ ప్రశంసలు..



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం ‘కిష్కింధపురి’. ఇటీవల థియేటర్లలో విడుదలై పాజిటివ్ టాక్‌తో ప్రదర్శితమవుతున్న ఈ సినిమాకు మెగాస్టార్ చిరంజీవి నుంచి అద్భుతమైన ప్రశంసలు అందాయి. ఈ చిత్రంపై తన అభిప్రాయాలను పంచుకుంటూ ఆయన విడుదల చేసిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, “‘కిష్కింధపురి’ సినిమా నాకు నిజంగా బాగా నచ్చింది. ఇది కేవలం సాధారణ హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. దర్శకుడు కౌశిక్ పగళ్ళపాటి ఎంచుకున్న సైకలాజికల్ యాంగిల్ చాలా కొత్తగా, ఆసక్తికరంగా అనిపించింది” అని కొనియాడారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటన ఎంతో బాగుందని, అనుపమ పరమేశ్వరన్ కూడా తన పాత్రకు పూర్తి న్యాయం చేసిందని మెచ్చుకున్నారు.సినిమా సాంకేతిక అంశాల గురించి కూడా చిరంజీవి ప్రత్యేకంగా ప్రస్తావించారు. “చైతన్ భరద్వాజ్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మంచి ఎనర్జీ ఇచ్చాయి. టెక్నికల్ వర్క్ సినిమా స్థాయిని మరింత పెంచింది. నా తదుపరి చిత్రం ‘శివ శంకర వరప్రసాద్ గారు’కు నిర్మాతలుగా ఉన్న సాహు గారపాటి ఈ సినిమాకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉంది” అని తెలిపారు. ఇలాంటి ఒక కొత్త ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని, థియేటర్లలో చూసి ఈ చిత్రాన్ని ప్రోత్సహించాలని ఆయన ప్రేక్షకులను కోరారు.ప్రస్తుతం మంచి స్పందనతో నడుస్తున్న ‘కిష్కింధపురి’ చిత్రానికి మెగాస్టార్ ప్రశంసలు తోడవడంతో రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# బ్లాక్ బస్టర్ తరువాత కనిపించని బ్యూటీ!

హీరోయిన్ అంటే గ్లామరస్ గానే ఉండాలి .. పాటలకి ముందే రావాలి .. పాటల్లో మాత్రమే కనిపించాలి అనే రోజులు పోయాయి. ఇప్పుడు చాలామంది హీరోయిన్స్ నటన ప్రధానమైన పాత్రలను మాత్రమే ఒప్పుకుంటూ వెళుతున్నారు. అలాంటి హీరోయిన్స్ లో సాయిపల్లవి .. నిత్యామీనన్ .. ఆ తరువాత స్థానంలో ఐశ్వర్య రాజేశ్ కనిపిస్తుంది. కోలీవుడ్ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతూ, తెలుగు తెరపై చోటు సంపాదించుకున్న కథానాయిక ఆమె.

ఐశ్వర్య రాజేశ్ గతంలో కొన్ని తెలుగు సినిమాలు చేసింది. అయితే తెలుగులో ఆమె నేరుగా చేసిన సినిమాలకంటే కూడా, తమిళం నుంచి ఓటీటీకి వచ్చిన అనువాదాలు ఇక్కడి ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ఆ జాబితాలో డ్రైవర్ జమున .. గ్రేట్ ఇండియన్ కిచెన్ .. సొపన సుందరి .. ఫర్హానా వంటి సినిమాలు కనిపిస్తాయి. ఈ సినిమాలలోని ఆమె నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె అభిమానులుగా మారిపోయారు. అలాంటి ఐశ్వర్య రాజేశ్ కి ఈ ఏడాది ఆరంభంలోనే ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమాతో బ్లాక్ బస్టర్ పడింది. ఈ సినిమాలో ఆమె పాత్రకి కూడా మంచి పేరు వచ్చింది. ఈ సినిమా తరువాత ఐశ్వర్య రాజేశ్ ఇక్కడ వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ అలాంటి వాతావరణమేమీ కనిపించడం లేదు. కన్నడ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండటం .. తమిళంలో బిజీగా ఉండటమే అందుకు కారణమా? లేదంటే సరైన కథలు రాకపోవడమా? అనేదే ఆమె అభిమానులకు అర్థం కావడం లేదు.





# సైలెంట్ గా పని కానిచ్చేస్తున్న తారక్

ఎన్నో ఆశలు పెట్టుకుని బాలీవుడ్ ఎంట్రీ ఇస్తూ ఎన్టీఆర్ చేసిన వార్2 సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అవడంతో తారక్ కొంత కాలం పాటూ అన్నింటి నుంచి గ్యాప్ తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ అన్నింటినీ అధిగమించి, తన నెక్స్ట్ మూవీ షూటింగ్ లో జాయిన్ అయ్యారు తారక్. ఎన్టీఆర్ తన తర్వాతి సినిమా డ్రాగన్ ను కెజిఎఫ్, సలార్ ఫేమ్ ప్రశాంత్ నీల్ తో చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి వరకు నో అప్డేట్స్ ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుండగా, లాస్ట్ వీక్ ఈ సినిమా షూటింగ్ ను చిత్ర యూనిట్ ఎలాంటి అనౌన్స్‌మెంట్ లేకుండానే తిరిగి మొదలుపెట్టినట్టు సమాచారం. అంతేకాదు, డ్రాగన్ కు సంబంధించి ఎలాంటి అప్డేట్స్ ను చిత్ర యూనిట్ వచ్చే ఏడాది జనవరి వరకు రిలీజ్ చేయడానికి రెడీగా లేదని సన్నిహిత వర్గాల నుంచి తెలుస్తోంది. భారీ నష్టాల్ని మిగిల్చిన వార్2 అటు ప్రశాంత్ నీల్, ఇటు ఎన్టీఆర్ ఇద్దరూ కూడా డ్రాగన్ ను భారీ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కించడంపైనే తమ దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఈ సారి ఆడియన్స్ ను కచ్చితంగా మెప్పించేలా ఎన్టీఆర్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారట. వార్2 సినిమా ఎన్టీఆర్ కెరీర్ కు భారీ నష్టాన్ని కలిగించడంతో పాటూ డిస్ట్రిబ్యూటర్లకు బాగా నష్టాలను మిగిల్చింది. డ్రాగన్ లో రిషబ్ శెట్టి గెస్ట్ రోల్ అందుకే ఈ సినిమా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందు నుంచే తారక్ జాగ్రత్తపడుతున్నారని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో మరికొన్ని సర్‌ప్రైజులు కూడా ఉంటాయని అంటున్నారు. డ్రాగన్ సినిమాలో కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి గెస్టు రోల్ లో కనిపించనున్నారని సమాచారం. ఈ విషయంపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ ఎన్టీఆర్ తో తనకున్న బాండింగ్ వల్ల రిషబ్ ఈ క్యారెక్టర్ ను చేయడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది.

## రవితేజ ఫ్యామిలీ నుంచి మరో హీరో..
# ‘మారెమ్మ’ గ్లింప్స్‌తో మాస్ ఎంట్రీ




టాలీవుడ్ ఇండస్ట్రీకి మరో స్టార్ వారసుడు పరిచయం కాబోతున్నాడు. మాస్ మహారాజా రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ భూపతి రాజు ‘మారెమ్మ’ అనే చిత్రంతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. సోమవారం మాధవ్ పుట్టినరోజు సందర్భంగా, చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన ఓ ప్రత్యేక గ్లింప్స్ వీడియోను విడుదల చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.

విడుదలైన ఈ గ్లింప్స్‌లో మాధవ్ పూర్తి మాస్ అవతారంలో కనిపించి ఆకట్టుకున్నాడు. గుబురు గడ్డం, రగ్గడ్ లుక్‌తో లుంగీ కట్టుకొని నడుస్తున్న తీరు, అతని బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే.. తొలి సినిమాతోనే బలమైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యాడని స్పష్టమవుతోంది. ఈ వీడియోతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. ముఖ్యంగా మాధవ్ స్క్రీన్ ప్రెజెన్స్, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.మాచర్ల నాగరాజు దర్శకత్వం వహిస్తున్న ‘మారెమ్మ’ చిత్రాన్ని మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఇది పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎమోషనల్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. వాస్తవిక ఘటనల స్ఫూర్తితో, సహజమైన వాతావరణంలో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు వెల్లడించారు.

ఈ సినిమాలో మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్‌గా నటిస్తోంది. వికాస్ వశిష్ఠ, వినోద్ కుమార్, దయానంద్ రెడ్డి, రూపా లక్ష్మి వంటి నటులు ఇతర కీలక పాత్రలలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రశాంత్ విహారి సంగీతం సమకూరుస్తున్నారు.

# చూపు తిప్పనివ్వని అందాల స్టార్ కిడ్



బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న యంగ్ స్టార్స్‌లో ఎక్కువ శాతం స్టార్ కిడ్స్ అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీకి ప్రతి ఏడాది ఎంతో మంది స్టార్ కిడ్స్ పరిచయం అవుతూ ఉంటారు. అయితే స్టార్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నంత మాత్రాన వారు ఇండస్ట్రీలో కొనసాగడం సాధ్యం కాదు. వారిలో ప్రతిభ, అందం, ఇంకా అణుకువ ఉంటేనే ఇండస్ట్రీలో ఉంటారు. ప్రతి ఏడాది ఎంట్రీ ఇచ్చిన స్టార్ కిడ్స్ లో దాదాపుగా సగం మంది ఇండస్ట్రీ బయటకు వెళ్లి పోతారు. అలా నెపో కిడ్ గా ఎంట్రీ ఇచ్చిన అనన్య పాండేను మొదట అంతా చాలా తక్కువ సమయంకే కనిపించకుండా పోతుందని అంతా భావించారు. కానీ తన ప్రతిభ చూపిస్తూ, అందాల ఆరబోత చేస్తూ, సోషల్ మీడియా ద్వారా, వెండి తెరపై తనదైన సత్తా చాటాడం ద్వారా బాలీవుడ్‌లో మెల్ల మెల్లగా స్టార్ హీరోయిన్స్ స్థాయికి చేరుకునేందుకు గాను తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. కేసరి 2 తో వచ్చిన అనన్య పాండే ఆకట్టుకునే అందం ఉన్నప్పటికీ ఈ అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి వరుస సినిమాలు చేయాలి అనుకున్న సమయంలోనే కరోనా వల్ల ఈమె ప్లాన్స్ రివర్స్ అయ్యాయి. అంతే కాకుండా ఇష్టం లేకుండా చేసిన లైగర్ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. విజయ్ దేవరకొండ హీరోగా పూరి దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ మిగిల్చింది. దాంతో కాస్త జాగ్రత్త పడ్డ ఈ అమ్మడు బాలీవుడ్‌లోనే సినిమాలు చేయడం మొదలు పెట్టింది. ఈ ఏడాది ఇప్పటికే కేసరి 2 సినిమాతో వచ్చిన అనన్య పాండే వచ్చే ఏడాది మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించే అవకాశాలు ఉన్నాయి. ఈ అమ్మడికి హిట్ లేకున్నా వరుస ఆఫర్లు రావడంకు కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. రెగ్యులర్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం అందరికీ తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో 26.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 26.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్న ఈ అమ్మడు ఏ ఫోటో షేర్ చేసినా నిమిషాల్లో వైరల్ అవుతుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఎలాంటి డ్రెస్ వేసినా అనన్య పాండే చూపు తిప్పనివ్వదు. అలాంటి అనన్య పాండే ఈసారి థైస్ ను చూపిస్తూ కవ్వించే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇవ్వడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆగి మరీ ఈ అమ్మడి ఫోటోలు చూసే వారు చాలా మంది ఉన్నారు. సింపుల్ హెయిర్ స్టైల్ తో, డీసెంట్ మేకోవర్‌తో అనన్య పాండే ఈ ఔట్ ఫిట్ లో భలే ఉంది అంటూ అభిమానులతో పాటు, సోషల్ మీడియాలో ఆమెను ఫాలో అయ్యే వారు, అంతే కాకుండా నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న లేడీకి కమర్షియల్ బ్రేక్ తప్పనిసరిగా రావాలంటూ కోరుకుంటున్నాం అంటున్న వారు చాలా మంది ఉన్నారు.